తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

వరంగల్ - ఆదిలాబాద్

హన్మకొండ | జనగాం | ములుగు | నిర్మల్ | మంచిర్యాల | ప్రొ. జయశంకర్ భూపాలపల్లి | కొమురం భీం ఆసిఫాబాద్ | మహబూబాబాద్

మంగళవారం 16 జూన్ 2026 | పేజీలు - 8



## ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి


- **జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్**

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 15(జనంసాక్షి ):** ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టర్ రెడ్డి భవన సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్, జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు లతో కలిసి అర్జిదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. కౌటాల మండలం మొగడ్ దగడ్ గ్రామానికి చెందిన చంద్రి మడిరాం తనకు వృద్ధాప్య పింఛన్ ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. రెబ్బెన మండలం నవేగాం గ్రామానికి చెందిన మహాత్మ శకుంతల తనకు రైతు బీమా డబ్బులు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. కాగజ్ నగర్ పట్టణం పోచమ్మ బస్తీకి చెందిన బత్తుల రాజేశ్వర్ దివ్యాంగుడు అయిన ఎలక్ట్రిక్ ట్రై సైకిల్ అందజేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. దహెగాం మండలం ఐనం గ్రామానికి చెందిన కెల్లూరి దుర్గా గౌడ్ తనకు ప్రభుత్వం ఇచ్చిన లావుని పట్టా భూమిని మిగతా 8లో..

# కాళేశ్వర ఆలయ పునర్నిర్మాణ పనులు

- **రూ.198 కోట్ల బడ్జెట్ మంజూరు**
- **ఆవరణలో పాత కట్టడాలు తొలగించేందుకు కసరత్తు**

**కాళేశ్వరం, జూన్ 14 (జనంసాక్షి) :** ప్రముఖ శైవక్షేత్రం, దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న కాళేశ్వర ముక్తీశ్వర స్వామి ఆలయం త్వరలో సరికొత్త వైభవాన్ని సంతరించుకోనుంది. దశాబ్దాల క్రితం నిర్మించిన పాత ఆలయాలు, మండపాలు, ప్రాకారాల స్థానంలో అత్యంత పటిష్టమైన, దీర్ఘకాలం మన్నేలా ఉండే శాశ్వత రాతి కట్టడాల నిర్మాణానికి దేవాదాయశాఖ శ్రీకారం చుట్టింది. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.198 కోట్ల భారీ బడ్జెట్‌ను ప్రకటించడమే కాకుండా పరిపాలనా అనుమతులను కూడా మంజూరు చేసింది. ఈ మహత్తర పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయడానికి గానూ ప్రస్తుతం ఆలయ ఆవరణలో ఉన్న పాత కట్టడాలను తొలగించేందుకు దేవాదాయశాఖ అధికారులు తుది కసరత్తు చేస్తున్నారు. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్టుకు సంబంధించి గత నెల ఏప్రిల్ 20వ తేదీన సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా కాళేశ్వర క్షేత్రంలో భూమిపూజ చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో జూన్ 17 న పాత నిర్మాణాల తొలగింపు ప్రక్రియను అధికారికంగా ప్రారంభించనున్నారు. గతంలో 1972 సంవత్సరానికి ముందు పూర్వకాలం నాటి ఆలయాలు ఉండగా వాటిని తొలగించి అప్పట్లో నూతన కట్టడాలు చేపట్టారు. ఆ తర్వాత శృంగేరి పీఠాధిపతుల సమక్షంలో జీర్ణోద్ధరణ, మహాకుంభాభిషేకం నిర్వహించారు. అయితే ఆ సమయంలో నిర్మించిన ఆలయాలు, చుట్టుపక్కల ఉన్న ప్రాకారాలు ప్రస్తుతం పూర్తిగా మరమ్మతులకు లోనయ్యాయి. దీంతో భవిష్యత్ తరాలను దృష్టిలో ఉంచుకుని శాశ్వత రాతి నిర్మాణాల కోసం దేవాదాయశాఖ పంపిన ప్రతిపాదనలకు ప్రభుత్వం పచ్చజెండా ఊపింది. కాళేశ్వర క్షేత్రానికి శృంగేరి శారదా పీఠంతో అత్యంత పురాతన, ఆధ్యాత్మిక అనుబంధం ఉంది. ఈ నేపథ్యంలోనే ఈ మహా పునర్నిర్మాణ ప్రక్రియకు శృంగేరి పీఠం నుంచి దేవాదాయశాఖ ముందస్తు అనుమతులు పొందింది. అయితే ఈ మాస్టర్ ప్లాన్‌లో భాగంగా గత ప్రభుత్వ హయాంలో నిర్మించిన కొన్ని కొత్త కట్టడాలను సైతం మాస్టర్ ప్లాన్ డిజైన్ కోసం తొలగించే అవకాశం ఉంది. యముడు, శివుడు కొలువై ఉన్న ప్రధాన గర్భాలయంతో పాటు శుభానంద దేవి ఆలయం, సరస్వతీ ఆలయం, అభిషేక మండపం, అనివెట్టి మండపం, రెండు కల్యాణ మండపాలు చుట్టూ ఉన్న ప్రాకార నిర్మాణాలన్నీ తొలగింపు జాబితాలో ఉన్నాయి. నలుదిక్కులా ఉన్న వైభోగ రాజగోపురాలను సైతం తొలగించి సరికొత్తగా నిర్మిస్తారనీ అధికారులు తెలిపారు. ఈ మహా ప్రాజెక్టుపై భక్తుల్లో హర్షం వ్యక్తమవుతున్నప్పటికీ కాలపరిమితిపై కొన్ని



ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రాబోయే 2027 జూలై నెలలో అత్యంత ప్రతిష్టాత్మకమైన గోదావరి పుష్కరాలు జరగనున్నాయి. పుష్కరాల సమయానికి దేశం నలుమూలల నుంచి లక్షలాది మంది భక్తులు కాళేశ్వర క్షేత్రానికి తరలివస్తారు. ఈలోగా ఈ భారీ రాతి నిర్మాణ పనులన్నీ పూర్తి చేసి కుంభాభిషేకం నిర్వహించడం సాధ్యమేనా? అని భక్తులు ప్రశ్నిస్తున్నారు. కేవలం ఏడాదిన్నర కాలం మాత్రమే సమయం ఉన్నందున పనుల్లో హడావుడి పెరిగి నిర్మాణ నాణ్యత ప్రశ్నార్థకంగా మారుతుందేమోనని స్థానికులు, నిపుణులు చర్చించుకుంటున్నారు. మిగతా 8లో..

# ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యం

- **జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**

జనగామ ప్రతినిధి, జూన్ 15(జనంసాక్షి): సోమవారం, జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని మెయిన్ కాన్ఫరెన్స్ హాల్లో నిర్వహించిన 'ప్రజావాణి' కార్యక్రమం ద్వారా ప్రజల నుంచి అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోంతో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లాలోని మారుమూల ప్రాంతాల నుంచి తమ సమస్యలను విన్నవించుకోవడానికి వచ్చే ప్రజల పట్ల అధికారులు సానుకూల దృక్పథంతో వ్యవహరించాలని, ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యం అని స్పష్టం చేశారు. అందిన ప్రతి దరఖాస్తును అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, సంబంధిత శాఖల ద్వారా సత్వరమే పరిష్కార మార్గాలను చూపాలని అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను వర్గీకరించి, వాటిని పరిష్కరించేందుకు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం (532) దరఖాస్తులను కలెక్టర్ స్వీకరించారు. ఈరోజు ప్రజావాణికి వచ్చిన కొన్నింటి దరఖాస్తుల వివరాలిలా ఉన్నాయి. బండనాగారం గ్రామం, బచ్చన్నపేట మండలానికి చెందిన యు. రాజు, బండనాగారం గ్రామం నుంచి లద్నూర్ గ్రామం వరకు ఉన్న దారిని సర్వే నంబర్ 52లో గల రైతులు మూసివేశారని, ఆ దారిని పునరుద్ధరించాలని మనవి చేస్తూ దరఖాస్తు చేసుకున్నారు. జనగామకు చెందిన బచ్చు బాల నారాయణ, ఇంటి నిర్మాణం కోసం మొరం గురించి అనుమతి కొరకు మీ-సేవాలో దరఖాస్తు చేసుకున్నారని, త్వరగా అనుమతి ఇవ్వాలని దరఖాస్తు చేసియున్నారు. రఘునాథపల్లి మండలంలోని



కోమల్ల గ్రామం కర్ణాలకుంట చెరువు కట్టపై ముళ్ల చెట్లను తొలగించి, గ్రామ స్మశానవాటిక స్థలాన్ని పరిరక్షించాలని గ్రామస్థులు ప్రార్థిస్తూ ఆర్జీ ద్వారా కోరారు. బండనాగారం గ్రామం, బచ్చన్నపేట మండలానికి చెందిన డి. సురేష్, తమ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల గేటుకు ఆనుకొని మంగళి డబ్బాను నిర్మించారని, మొత్తం బ్లేడ్లు, వెంట్రుకలు పాఠశాల ఆవరణలోకి కొట్టుకు వస్తున్నాయని, విద్యార్థులు భోజనం చేసే దాంట్లో, అలాగే వండే ఆహార పదార్థాలలో పడుతున్నాయని, ఆ డబ్బాను అక్కడ నుంచి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతూ వినతిపత్రం సమర్పించనైనది. బండనాగారం గ్రామం, బచ్చన్నపేట మండలానికి చెందిన ఏ. ఆశా రాణి, ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకోలేదని, తనకు తెల్ల రేషన్ కార్డు ఉందని, ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయగలరని దరఖాస్తును సమర్పించినారు. ఈ ప్రజావాణిలో జెడ్పీ సీఈవో రంగా రావు, గృహ నిర్మాణ శాఖ పీడీ మాతృ నాయక్, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారానికి అధికారులు సత్వర చర్యలు తీసుకోవాలి

- **జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**



**ములుగు ప్రతినిధి, జూన్ 15(జనంసాక్షి) :** ప్రజా వాణిలో ఫిర్యాదు దారులు అందించిన అర్జీలను సత్వరమే వేగంగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో మొత్తం 73 దరఖాస్తులు రాగా వాటిలో ఇందిరమ్మ ఇండ్లకు 21,పెన్షన్ లకు 21,ఇతర శాఖలకు సంబంధించినవి 31 దరఖాస్తులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల నుండి సమస్యల అర్జీలను నేరుగా జిల్లా కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి దరఖాస్తును వ్యక్తిగతంగా పరిశీలించి సంబంధిత శాఖలకు వెంటనే ఎండార్స్మెంట్ చేయడం జరిగిందని తెలిపారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు అందిన ప్రతి దరఖాస్తును ప్రజావాణి పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని, దరఖాస్తుదారునికి వెంటనే కంప్యూటర్ ఆధారిత రశీదు అందజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో తమ సమస్యలపై దరఖాస్తులు అందించినవారు తమ సమస్య స్థితిగతులను కంప్యూటర్ రసీదు ద్వారా పరిశీలించుకోవచ్చు అని సూచించారు. ప్రజావాణి ద్వారా అందిన ప్రతి వినతిని ప్రాధాన్యంగా తీసుకుని,నిర్దిష్ట కాలపరిమితిలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, డిఆర్ఓ రవి కుమార్, ఆర్డీవో కృష్ణవేణి,అన్ని శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# మండల కేంద్రంలో నూతన ఇంగ్లీష్ మీడియం పాఠశాల



**నేరడిగొండ జూన్15(జనంసాక్షి):** మండల కేంద్రంలో నూతన ఇంగ్లీష్ మీడియం పాఠశాలను ముఖ్య అతిథిగా హాజరైన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాధవ్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు నిర్మాణంలో నాణ్యమైన విద్య కీలక పాత్ర పోషిస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కూడా పట్టణ స్థాయి విద్యను అందిపుచ్చుకోవాలనే ఉద్దేశ్యంతో ఇటువంటి విద్యాసంస్థలు ఏర్పడటం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఇంగ్లీష్ భాషపై పట్టు ఎంతో అవసరమని, విద్యార్థులు చదువుతో పాటు క్రమశిక్షణ,నైతిక విలువలు అలవరచుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. ప్రభుత్వం విద్యాభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని,ప్రతి విద్యార్థికి మెరుగైన అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తోందని తెలిపారు. పాఠశాల యాజమాన్యం విద్యార్థులకు ఉత్తమ విద్యతో పాటు ఆధునిక సౌకర్యాలు అందించి ఆదర్శవంతమైనవిద్యాసంస్థగా తీర్చిదిద్దాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాల గదులను పరిశీలించి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్ స్థానిక సర్పంచి ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి పందరీ విద్యాశాఖ అధికారులు పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు తల్లిదండ్రులు విద్యార్థులు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# కుబీర్ జెడ్పీహెచ్ఎస్‌లో అట్టహాసంగా బడి పునఃప్రారంభం

## విద్యార్థులకు పుష్పగుచ్ఛాలతో ఉపాధ్యాయుల ఘన స్వాగతం



**కుబీర్, జూన్ 15, (జనంసాక్షి):** వేసవి సెలవుల సందడి ముగిసింది.. మళ్ళీ బడి గంట మోగింది. సుదీర్ఘ విరామం తర్వాత సోమవారం కుబీర్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పునఃప్రారంభమైంది. తొలిరోజే విద్యార్థులు నూతనోత్సాహంతో పాఠశాలకు తరలిరావడంతో విద్యాకుసుమాల కోలాహలం నెలకొంది. పాఠశాల ముఖద్వారం వద్దే ఉపాధ్యాయులు విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. దీంతో పాఠశాల ఆవరణమంతా పండుగ వాతావరణాన్ని తలపించింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సట్ల గంగాధర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలు నేడు కార్పొరేట్ సంస్థలకు దీటుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నాయని, నాలుగు సంవత్సరాలుగా పదవ తరగతి ఫలితాల్లో 100% ఫలితాలు సాధించామని పేర్కొన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులు, మెరుగైన వసతులు ప్రభుత్వ బడుల్లో అందుబాటులో ఉన్నాయని, విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ ఏడాది పదో తరగతి విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి ఉత్తమ ఫలితాలు సాధించేలా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఆయన వెల్లడించారు. విద్యార్థులు సెలవుల తర్వాత స్నేహితులను కలుసుకున్న విద్యార్థుల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. సెలవుల్లో తాము వివిధ పర్యాటక ప్రాంతాలను సందర్శించామని, ఆ పర్యటనల ద్వారా ఎన్నో కొత్త విషయాలను తెలుసుకున్నామని విద్యార్థులు ఉత్సాహంగా పంచుకున్నారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు మాట్లాడుతూ.. ఈ విద్యా సంవత్సరం మాకు ఎంతో కీలకం. కష్టపడి చదివి, పదో తరగతిలో అత్యుత్తమ గ్రేడ్ పాయింట్లు సాధించి బాసర ఐఐఐటీలో సీటు సంపాదించడమే మా ప్రధాన లక్ష్యం అని ధీమా వ్యక్తం చేశారు. తమ తల్లిదండ్రులకు, చదువు చెప్పే గురువులకు, పాఠశాలకు మంచి పేరు తీసుకువస్తామని అన్నారు.

# ప్రభుత్వ పాఠశాలలోని నాణ్యమైన విద్య



**నేరడిగొండ జూన్15(జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలలో అనుభవజ్ఞులై ఉపాధ్యాయులచే మంచి నాణ్యమైన విద్యను బోధించగలరు ప్రధానోపాధ్యాయులు పద్మ పేర్కొన్నారు. సోమవారం రోజున మండల కేంద్రంలో గల జిల్లా పరిషత్ హైస్కూల్లో గ్రామ సర్పంచ్ ఏలేటి నీలిమ రవీందర్ రెడ్డి పునః ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా నూతన విద్యార్థులకు అడ్మిషన్లు కల్పించి, విద్యార్థులందరికి ఉచితంగా పుస్తకాలు,నోట్ బుక్ లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రైమరీ పాఠశాల పూర్తి చేసుకున్న విద్యార్థులను జడ్పి హైస్కూల్ లో చేర్పించాలని కోరారు. ప్రధానోపాధ్యాయురాలు పద్మ మాట్లాడుతూ అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే మంచి నాణ్యమైన విద్యను బోధించడంజరుగుతుందని, విద్యార్థులకు ఇదో చక్కని అవకాశామని,దీనిని వినియోగించుకోవాలని అన్నారు. వీడీసీ అధ్యక్షులు ఏలేటి రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఎటువంటి సమస్య ఉన్న తన దృష్టికి తీసుకొస్తే తీసుకురావాలని పరిష్కారిస్తానని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వార్డు సభ్యులు సాబ్లే సంతోష్ సింగ్ మాట్లాడుతూ పిల్లలతో పాటు ఉపాధ్యాయులు కూడా సమయపాలన పాటించాలని,ఎమ్మెల్యే ప్రత్యేక చొరవతో జడ్పీ హైస్కూల్ వచ్చే ఏడాది నుండి పబ్లిక్ స్కూల్ గా ఆధునికరించడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోతి గులాబ్ సింగ్, వార్డు సభ్యులు సాబ్లే సంతోష్ సింగ్ ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

# అమ్మ మాట అంగన్వాడి బాట



**మొగుళ్ళ పల్లి, జూన్ 15( జనం సాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మొగుళ్లపల్లి మండల కేంద్రంలోని మొగుళ్ళ పల్లి, పార్లపల్లి గ్రామంలో సోమవారం ఐసిడిఎస్ సూపర్వైజర్ అరుణాదేవి, సుజాతల ఆధ్వర్యంలో అమ్మ మాట అంగన్వాడి బాట ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా 3-6సం పిల్లలను అంగన్వాడీ సెంటర్ కి పంపించాలని గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పర్లపల్లి గ్రామ సర్పంచ్ జోరుక సదయ్య , వార్డ్ మెంబర్స్ పాల్గొన్నారు. అనంతరం సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలోని 3-6సం పిల్లలని అంగన్వాడి సెంటర్లకు పంపించుటకు గ్రామంలోని ప్రజలను మోటివేషన్ చేస్తామని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా మీటింగ్ కండక్ట్ చేసి 3 -6 పిల్లలకు సంబంధించిన ప్రీస్కూల్ పుస్తకాలు,మెటీరియల్ గ్రామ సమర్పంచ్ ఆధ్వర్యంలో వారికి అందించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు పద్మ, సరోజన, ప్రమీల, స్వప్న, వెన్నెల, రజిత,సరూప,అంగన్వాడి హెల్పర్స్,ఆయాలు కిశోర బాలికలు, పిల్లలు తదితరులు పాల్గొన్నారు.

# మున్సిపల్ నూతన కార్యాలయ భవన పనుల పరిశీలించిన వైస్ చైర్మన్ అప్పాల గణేష్



**నిర్మల్ బ్యూరో, జూన్15,(జనంసాక్షి)** నిర్మల్ పట్టణంలోని పాత మున్సిపల్ కార్యాలయ భవనం వెనుక నిర్మాణంలో ఉన్న నూతన మున్సిపల్ కార్యాలయ భవన పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ అప్పాల గణేష్ చక్రవర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా భవన నిర్మాణ పనుల పురోగతి, నాణ్యత ప్రమాణాలు, ప్రజలకు అందించాల్సిన సౌకర్యాలపై అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించే లక్ష్యంతో నిర్మాణ పనులను నాణ్యతతో పాటు త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గోపు గోపి, పెండం శ్రీనివాస్, రాఘవేంద్ర చారి, గుంజల చైతన్య, లక్కాకుల హరీష్, మాజీ కౌన్సిలర్ తోట నర్సయ్య, నల్లూరి పోశెట్టి, నాయకులు ఆడప శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీ చాటుకున్న రాజశేఖర్



**తాండూర్, జూన్ 15(జనం సాక్షి )** మంచిర్యాల జిల్లా : తాండూర్ మండలంలోని గోపాల్ నగర్ శివారులో పడిపోయిన సాలిగామ మల్లన్న పర్సును అచ్చలాపూర్కు చెందిన గట్టు రాజశేఖర్ భద్రంగా అప్పగించారు. రోడ్డుపై దొరికిన ఆ పర్సులోని విజిటింగ్ కార్డ్ ఆధారంగా ఫోన్ చేసి, సోమవారం దానిని మల్లన్నకు అందజేశారు. ఈ సందర్భంగా మల్లన్న ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు, రాజశేఖర్ చూపిన నిజాయితీని మండల ప్రజలు, పలువురు ప్రముఖులు అభినందించారు.

## ఎస్సైని మర్యాదపూర్వకంగా కలిసిన యూత్ కాంగ్రెస్ నాయకులు



మహాముత్తారం జూన్ 15 (జనం సాక్షి) ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన, గొర్ల రమేష్‌ను, సోమవారం, యూత్ కాంగ్రెస్ నాయకులు, మర్యాదపూర్వకంగాకలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్సైని శాలువాతో ఘనంగా,సన్మానించిశు భాకాంక్షలుతెలియజేశారు. ఈ కార్యక్రమం, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జాటోత్ వంశీరాజ్, స్తంభంపల్లి పి పీ మాజీ సర్పంచ్ జాడి రాజయ్య, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు గాదె రవీందర్, మహా ముత్తారం టౌన్ యూత్ అధ్యక్షుడు తాళ్లపల్లి సుధాకర్ గౌడ్, గ్రామ యూత్ అధ్యక్షుడు మాదెం ప్రసాద్, వివిధ గ్రామాల యూత్ అధ్యక్షులు, రాజేష్, సమ్మిలాల్, రామ్ లక్ష్మణ్, నాగరాజు, సృజన్, మధుకర్,నగేష్ యువజన కాంగ్రెస్ నాయకులు తేజ,కృష్ణంరాజు, మరియు మారుపాక రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### జిల్లాలో నిరుద్యోగ యువతకు అనుగుణంగా

## నోటిఫికేషన్ విడుదల చేయాలి



కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 15(జనంసాక్షి ): రాష్ట్రంలో నిరుద్యోగ సమస్య తీవ్ర స్థాయికి చేరుకుందని నిరుద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన 5,000 కానిస్టేబుల్ పోస్టులు ప్రస్తుతం ఉన్న నిరుద్యోగుల సంఖ్యకు సరిపోవని, కనీసం 15,000 నుంచి 20,000 వరకు పోస్టులు పెంచాలని వారు డిమాండ్ చేశారు. సోమవారం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో నిరుద్యోగులు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఉద్యోగ అవకాశాలు పెరగకపోవడంతో యువత తీవ్ర నిరాశకు గురవుతున్నారని వారు తెలిపారు. అలాగే వయోపరిమితి సడలింపు ఇవ్వాలని, దీర్ఘకాలంగా ఖాళీగా ఉన్న పంచాయతీ సెక్రటరీ పోస్టులకు వెంటనే నోటిఫికేషన్లు విడుదల చేయాలని కోరారు. నిరుద్యోగుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం తక్షణమే సానుకూల నిర్ణయం తీసుకోవాలని, ఉద్యోగ నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని వారు ముఖ్యమంత్రిని విజ్ఞప్తి చేశారు.

## బడిబాటతో బడులకు బంగారు బాట.. డిఈఓ భోజన్న



నిర్మల్ బ్యూరో, జూన్15, (జనంసాక్షి) ప్రొ. జయశంకర్ బడిబాట-2026 కార్యక్రమంలో భాగంగా పాఠశాలల పునఃప్రారంభ దినోత్సవాన్ని రత్నపూర్ కాండ్లి ప్రాథమిక పాఠశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖాధికారి పాఠశాలను సందర్శించి విద్యార్థులకు ఆత్మీయ స్వాగతం పలికారు. పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం తెలిపిన డీఈఓ, అనంతరం పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, వర్క్‌బుక్స్ పంపిణీ చేసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, బడిబాట కార్యక్రమం ద్వారా ప్రతి చిన్నారిని పాఠశాలకు చేర్చే దిశగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం ఉంచి తమ పిల్లలను చేర్పించాలని కోరారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, గ్రామ సర్పంచ్, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పాముకాటుతో మృతి చెందిన రాజేశ్వర్ కుటుంబానికి ఆర్థిక సాయం



ఖానాపూర్ రూరల్ 15 జూన్ (జనం సాక్షి): పాముకాటతో మృతి చెందిన షటిల్ బ్యాడ్మింటన్ క్లబ్ అధ్యక్షుడు ఏనుగుల రాజేశ్వర్ కుటుంబానికి సోమవారం ఖానాపూర్ షటిల్ బ్యాడ్మింటన్ సభ్యులు రూ. 21,300 ఆర్థిక సహాయాన్ని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. ఖానాపూర్ షటిల్ బ్యాడ్మింటన్ క్లబ్ అధ్యక్షులు ఏనుగుల రాజేశ్వర్ ఇటీవల పాముకాటు కారణంగా మృతి చెందడం పట్ల క్లబ్ సభ్యులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. రాజేశ్వర్ షటిల్ బ్యాడ్మింటన్ క్లబ్ అభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని సభ్యులు పేర్కొన్నారు. ఆయన క్రీడా ప్రోత్సాహానికి చేసిన కృషిని గుర్తుచేసుకుంటూ నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో షటిల్ బ్యాడ్మింటన్ క్లబ్ సభ్యులు ఆసూరి సంతోష్ కుమార్, గంప హరీష్, చాకలి రవి, లక్ష్మతుల రమేష్, బీసీ రమేష్, జక్కుల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో ఫిర్యాదుకు తక్షణ స్పందన - దివ్యాంగుడికి బ్యాటరీ ట్రై సైకిల్ మంజూరు

### స్వావలంబన దిశగా దివ్యాంగుడికి కలెక్టర్ చేయూత



జనగామ ప్రతినిధి,జూన్ 15(జనంసాక్షి): దివ్యాంగుల స్వావలంబన, జీవనోపాధి మెరుగుదలకు జిల్లా పరిపాలన ప్రత్యేక శ్రద్ధ కనబరుస్తోంది. ప్రజావాణి ద్వారా తమ అవసరాలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చిన దివ్యాంగులకు స్పందిస్తూ, బ్యాటరీ ట్రై సైకిళ్లను అందజేయడం ద్వారా వారి జీవన ప్రయాణానికి భరోసా కల్పిస్తోంది. ఈ సహాయంతో లబ్ధిదారులు స్వతంత్రంగా తమ దైనందిన కార్యకలాపాలు నిర్వహించడంతో పాటు ఉపాధి అవకాశాలను కూడా మెరుగుపరుచుకునే అవకాశం లభించిందని ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే జిల్లాలోని పాలకుర్తి మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన దివ్యాంగుడు నారగోని యాకయ్య, తమ జీవనోపాధి కోసం బ్యాటరీ ట్రై సైకిల్ అవసరమని ఈరోజు ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా కు దరఖాస్తు సమర్పించారు. తమ దైనందిన అవసరాలు తీర్చుకోవడం, స్వయం ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవడం కోసం రవాణా సౌకర్యం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వారు తమ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో వినతిని పరిశీలించిన కలెక్టర్ వెంటనే సంబంధిత అదనపు కలెక్టర్ (రెవెన్యూ), వికలాంగుల సంక్షేమ శాఖ అధికారి (ఐబో) బెన్షాలోమ్ కుల వారి అర్హతలు పరిశీలించి, తగిన చర్యలు తీసుకొని, లబ్ధిదారుడికి బ్యాటరీ ట్రై సైకిల్ మంజూరు చేయాలని సూచించారు. అనంతరం శాఖాధికారులు అవసరమైన ప్రక్రియను పూర్తి చేసి, యాకయ్యకు బ్యాటరీ ట్రై సైకిల్ ను అందజేశారు. ఈ చర్య ద్వారా వారి రవాణా సమస్యకు తక్షణ పరిష్కారం లభించింది. లబ్ధిదారుడి సంతోషం బ్యాటరీ ట్రై సైకిల్ అందుకున్న నారగోని యాకయ్య తన సంతోషాన్ని వ్యక్తం చేస్తూ, చాలా కాలంగా రవాణా సౌకర్యం లేక నిత్యావసర పనులు, వ్యక్తిగత అవసరాల కోసం ఇతరులపై ఆధారపడాల్సి వచ్చేదని చెప్పారు. ప్రజావాణిలో చేసిన వినతికి లిజిల్లా కలెక్టర్‌లి వెంటనే స్పందించి, బ్యాటరీ ట్రై సైకిల్ అందజేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తమలాంటి దివ్యాంగుల అవసరాలను గుర్తించి, అండగా నిలిచిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బెన్షాలోం గార్లకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేస్తూ, ఈ సహాయం తమ జీవితంలో కొత్త ఆశలు నింపిందని యాకయ్య ఆనందం వ్యక్తం చేశారు. ప్రజావాణిలో వచ్చిన వినతులను మానవీయ దృక్పథంతో పరిశీలిస్తూ, అర్హులైన వారికి సత్వర సహాయం అందించడంలో జిల్లా పరిపాలన ముందుంటోంది. ఈ చర్యలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిజమైన లబ్ధిదారులకు చేరుతున్నాయనే విషయాన్ని స్పష్టం చేస్తూ, ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులకు దోహదపడుతున్నాయి.

## బ్రాహ్మణపల్లి పాఠశాలలో విద్యార్థులకు ఘన స్వాగతం

- పాఠశాలకు 15 వేల విలువగల ఎల్ఈడి టీవీ బహుకరించిన ఉపాధ్యాయుడు సూర్యతేజ
- ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అందరూ కృషి చేయాలి
- జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి



మహబూబాబాద్ బ్యూరో, జూన్ 15(జనం సాక్షి): వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు పునః ప్రారంభం అవుతున్న సందర్భంగా మండలంలోని ప్రాథమికోన్నత పాఠశాల బ్రాహ్మణపల్లిలో పాఠశాలను మామిడి, కొబ్బరి తోరణాలు , బెలూన్స్, పూలతో సుందరంగా అలంకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం బ్యాండ్ మేళాలతో విద్యార్థులకు ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి హాజరయ్యారు. సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధారావత్ బద్రు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో డీఈవో మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాల యొక్క గొప్పతనాన్ని, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను గురించి వివరించారు. ప్రభుత్వ బడి అమ్మ ఒడితో సమానమని అన్నారు. ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు వారి గ్రామంలో ఉన్న ప్రభుత్వ బడిలో పిల్లలను చేర్పించేలా కృషి చేసి, ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేయడానికి సహకరించాలని కోరారు. బ్రాహ్మణపల్లి పాఠశాల ఉపాధ్యాయులు కుప్పం సూర్యతేజ పాఠశాల విద్యార్థుల అభ్యసనం మెరుగుపరచడానికి, డిజిటల్ విద్యను అందించడానికి పాఠశాలకు 15 వేల విలువగల ఎల్ఈడి టీవీ బహుకరించారు. దీనిని జిల్లా విద్యాశాఖ అధికారి చేతుల మీదుగా ఆవిష్కరించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు డీఈవో చేతుల మీదుగా పుస్తకాలు, నోటుబుక్కుల పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోట ఎల్లేష్, ఉపసర్పంచ్ బండారి మహేష్, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారులు వంగ సురేష్, మెత్కూరి వెంకటేశ్వర్లు, జి సి డి ఓ యద్దనపూడి గాయత్రి, పాఠశాల ఉపాధ్యాయులు పాలకుర్తి మౌనిక, మాడిశెట్టి సూర్యప్రకాష్, గొట్టిముక్కల పవన్ రాజు,రాచకొండ ఉపేందర్, కుప్పం సూర్యతేజ, భానోత్ శంకర్, గిద్దె శృతి తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చేరిక, మీ బంగారు భవిష్యత్తుకు పునాది




కాళేశ్వరం , జూన్ 14 , (జనం సాక్షి) జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మహాదేవపూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల అధ్యాపకులు కాళేశ్వరం గ్రామ సర్పంచ్ వెన్నపురెడ్డి మోహనరెడ్డి, ఉపసర్పంచ్ సుధీర్ మరియు వారి బృందం తో కలిసి కాళేశ్వరం గ్రామంలో విద్యార్థుల అడ్మిషన్ కోసం విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటర్ పూర్తి చేసిన విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అందుబాటులో ఉన్న కోర్సులు, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, స్కాలర్‌షిప్‌లు, ఉచిత విద్యా సదుపాయాలు మరియు ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు. ఈ సందర్భంగా కాళేశ్వరం గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో మంచి అనుభవం కలిగిన అధ్యాపకులు ఉన్నారని, మంచి సృజనాత్మకత తో కూడిన విద్య అందిస్తున్నారు అని అన్నారు. మన నియోజకవర్గం మహాదేవపూర్ మండలంలో ఉన్న ఒకే ఒక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మన పై ఉంది అని కాబట్టి విద్యార్థులు దోస్త్ ద్వారా ఆన్‌లైన్‌లో అడ్మిషన్లు పొందవచ్చని వివరించారు. అలాగే అడ్మిషన్స్ లో భాగంగా ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలనీ చెప్పిన కళాశాల ప్రిన్సిపాల్ జన్ను విజయ్ కుమార్ ను మరియు దగ్గరుండి విద్యార్థులతో మమేకం అవుతున్న అధ్యాపకులు డాక్టర్ రాజు, డాక్టర్ రజిత లను కాళేశ్వరం సర్పంచ్ ప్రత్యేకంగా అభినందిస్తూ విద్యార్థుల చేరికకు మా వంతు కృషి అందిస్తామని తెలిపారు.

# నియంత్రానికే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం

## తాండూర్ సిఐ దేవయ్య



**తాండూర్,జూన్ 15(జనం సాక్షి)** రేచిని గ్రామంలో పోలీసుల కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈరోజు ఉదయం తాండూర్ సీఐ దేవయ్య,ఎస్ఐ ప్రసాద్ ఆధ్వర్యంలో తాండూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రేచిని గ్రామంలో కమ్యూనిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా మొత్తం 40 బైక్‌లను తనిఖీ చేసి ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించిన వారిపై జరిమానాలు విధించారు మరియు అక్రమంగాబెల్ట్ షాప్లు నిర్వహిస్తున్న వారి దుకాణాలుతనిఖీ చేసి 30 బాటిల్ ల మద్యాన్ని పట్టుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ,సైబర్ మోసాలు మరియు సోషల్ మీడియా విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,తెలియని లింకులు ఓపెన్ చేయకూడదని, ఓటీపీలు మరియు బ్యాంకు వివరాలను ఎవరితోనూ పంచుకోకూడదని సూచించారు. ఫేక్ కాల్స్,ఫిషింగ్ సందేశాలు,సోషల్ మీడియా మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని,హెల్మెట్ ధరించడం,సీటుబెల్ట్ వినియోగం తప్పనిసరి అని,మద్యం సేవించి వాహనం నడపకూడదని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే డయల్ 100 సేవలను వినియోగించాలని తెలిపారు. గంజాయి మరియు మత్తు పదార్థాల నిర్మూలన కోసం ప్రజలందరూ భాగస్వాములు కావాలని,గంజాయి మరియు డ్రగ్స్ వినియోగం ఆరోగ్యానికి మరియు సమాజానికి హానికరమని వివరించారు. యువత ఈ అలవాట్లకు దూరంగా ఉండాలని, అనుమానాస్పద కార్యకలాపాలను పోలీసులకు వెంటనే తెలియజేయాలని కోరారు. రైతులు నకిలీ విత్తనాల విషయంలో జాగ్రత్తగా ఉండాలని, ధృవీకరించిన విక్రేతల వద్ద నుంచే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. బాల్య వివాహాలు,వరకట్నం వంటి సామాజిక దుష్ప్రవర్తనలను నిరోధించాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం స్వీయరక్షణ మరియు నేరాల నియంత్రణకు సీసీటీవీ కెమెరాల ఏర్పాటు ఎంతో అవసరమని తెలిపారు. గ్రామాల ప్రవేశ, నిష్క్రమణ ప్రాంతాల్లో అలాగే ఇళ్ల వద్ద సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా నేరాలను తగ్గించవచ్చని, భద్రతను పెంచవచ్చని వివరించారు. మానసిక ఒత్తిడి ఎదురైనప్పుడు కుటుంబ సభ్యులు, స్నేహితులతో మాట్లాడాలని, అవసరమైతే కౌన్సెలింగ్ తీసుకోవాలని సూచించారు. సమస్యలకు ఆత్మహత్య పరిష్కారం కాదని అవగాహన కల్పించారు. పోలీసులు ప్రజల్లో భద్రతపై అవగాహన పెంపొందించడం మరియు నేరాలను నివారించడం లక్ష్యంగా ఇలాంటి కార్యక్రమాలను కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తాండూర్ సీఐ దేవయ్య,తాండూర్ ఎస్ఐ ప్రసాద్, ఎస్ఐ కోటేశ్వర్ (భీమిని) మరియు సర్కిల్ సిబ్బంది పాల్గొన్నారు.

# చాతాలో పోలీసుల కార్డన్ సెర్చ్

## నేరాల నియంత్రణే లక్ష్యం: ఏఎస్పీ సాయి కిరణ్



**కుబీర్, జూన్ 15:** కుబీర్ మండలంలోని చాతా గ్రామంలో సోమవారం తెల్లవారుజామున పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. భైంసా ఏఎస్పీ సాయి కిరణ్ నేతృత్వంలో సుమారు 25 మందికి పైగా పోలీసులు గ్రామంలోని ప్రతి ఇంటిని సోదా చేశారు. ఈ తనిఖీల్లో సరైన ధృవీకరణ పత్రాలు లేని 92 ద్విచక్ర వాహనాలు, ఒక ఆటోను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏఎస్పీ గ్రామస్తులతో మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణ కోసమే ఈ తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. గ్రామంలో కొత్త వ్యక్తులు లేదా అనుమానితులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. యువత మాదకద్రవ్యాల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని, సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడి డబ్బులు పోగొట్టుకోవద్దని అవగాహన కల్పించారు. గ్రామంలో ఎలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరిగినా సహించబోమని, ప్రజలు పోలీసులకు సహకరించి గ్రామాన్ని నేరరహితంగా తీర్చిదిద్దాలని కోరారు. ఈ కార్యక్రమంలో భైంసా రూరల్ సీఐ ప్రవీణ్ కుమార్, కుబీర్ ఎస్సై కృష్ణారెడ్డి, కుంటాల ఎస్సై అశోక్‌తో పాటు ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వయోవృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవం

## చెన్నారావుపేట మండల కేంద్రంలో ర్యాలీ




**చెన్నారావుపేట, జూన్ 15 ( జనం సాక్షి:** మండల వయోవృద్ధుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో చెన్నారావుపేట మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. వయో వృద్ధుల వేధింపుల నివారణ దినోత్సవంను పురస్కరించుకొని సోమవారం వయోవృద్ధుల సంక్షేమ సంఘం అధ్యక్షులు ఈగ సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ములుక సాంబయ్య కవి ఆధ్వర్యంలో ర్యాలీని చేపట్టారు. తదనంతరం సభ్యులందరితో కలిసి గ్రామపంచాయతీకి వెళ్లి వయో వృద్ధుల సమస్యల పట్ల సహాయ సహకారాలు ఎల్లవేళలా అందించాలని కోరుతూ సర్పంచ్ కంది శ్వేత కృష్ణ చైతన్య రెడ్డికి వినతి పత్రాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో కార్యవర్గ సభ్యులు వరంగంటి మల్లయ్య, వరంగంటి కుమారస్వామి, చందుల కృష్ణమూర్తి, కంది నారాయణరెడ్డి, ముత్యం సాంబయ్య, గట్ల కృష్ణయ్య, బిక్షపతి, సిద్ధ కుమారస్వామి, వయో వృద్ధులు పాల్గొన్నారు.

# మూడు నెలలపాటు సిపిఎం పోరాటాలు

## సిపిఎం జిల్లా కార్యదర్శి మొకు కనకా రెడ్డి



**బచ్చన్నపేట జూన్ 15 ( జనం సాక్షి):** ప్రైవేటు విద్యా వైద్యం స్థానిక సమస్యలపై సిపిఎం పార్టీ మూడు నెలల పాటు పోరాటాల నిర్వహిస్తామని సిపిఎం జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. గత మూడు రోజులుగా సిపిఎం బచ్చన్నపేట మండలం కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నటువంటి రాజకీయ శిక్షణ తరగతులలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు సుంచు విజేందర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నెలకొన్నటువంటి స్థానిక సమస్యలు సిసి రోడ్లు డ్రైనేజీ ఇందిరమ్మ ఇండ్లు పనికార పథకం పైన అలాగే రైతుల సమస్యల పైన సిపిఎం పార్టీ ప్రత్యేక దృష్టి పెడుతుందని వీటి పైన పోరాటాలు ఉంటాయని అన్నారు. ప్రభుత్వ రంగ స్కూళ్లను ప్రోత్సహించాలని అలాగే ప్రభుత్వం హాస్పిటల్స్ ను మెరుగుపరచాలని ప్రైవేట్ స్కూళ్లలో అధిక ఫీజులను అరికట్టాలని ప్రవేట్ హాస్పిటల్ లో అధిక వసూళ్లను నిలిపివేయాలని లేనిచో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో మూడు నెలలపాటు ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాపర్తి రాజు, సాంబరాజు యాదగిరి,బొట్ల శేఖర్,జిల్లా మండల కార్యదర్శి బెల్లంకొండ వెంకటేష్ జిల్లా కమిటీ సభ్యులు బూడిద గోపి,జోగు ప్రకాష్,మునిగెల రమేష్.బోడ నరేందర్,చిట్యాల సోమన్న,ఎండి అజారుద్దీన్,మండల కార్యధర్శులు,సాదం రమేష్,మాచర్ల సారయ్య, మండల కమిటీ సభ్యులు మిన్నలపురం ఎల్లయ్య. రావుల రవీందర్ రెడ్డి. పర్వతం నర్సింహులు,బైరగొని బలరాములు. తాడెం రాములు,లక్ష్మీ కల్పనా,ఇంజ ఎల్లయ్య, రామగళ్ల అశోక్. సులోచన,రాజేశ్వరి, కవిత,లతకుమారి,మమత,అనితశభాషిని,కనకయ్య,చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు

# మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించండి

## ప్రధానోపాధ్యాయులు చెర్రీ ప్రభాకర్



**మహా ముత్తారం జూన్ 15 (జనం సాక్షి)** ఈరోజు ప్రభుత్వ పాఠశాల ప్రారంభించాము మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించండి అని తల్లిదండ్రులకు తెలియజేస్తున్నారు. సోమవారం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రారంభం అనంతరం ప్రధానోపాధ్యాయులు చెర్రీ ప్రభాకర్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి చదివించాలని తల్లిదండ్రులకు తెలియజేస్తున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొని గ్రామస్తులంతా సహకరించాలని కోరుతున్నారు.

# విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ



**చెన్నారావుపేట, జూన్ 15( జనం సాక్షి):** విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలను పంపిణీ చేసినట్లు నాయక్ పోడు కాలనీ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొమ్మెర సతీష్ తెలిపారు. సోమవారం పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు పాఠశాల ప్రారంభం రోజే ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులు, పెన్నులు, పెన్సిల్లు, రబ్బర్లు, షార్ప్ నర్లు ఉచితంగా అందించినట్లు తెలిపారు. విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో అందించే నాణ్యమైన విద్యను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయురాలు పద్మ, సీఆర్పీ బాలు, మధ్యాహ్న భోజన కార్మికురాలు వెంకటమ్మ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడి కేంద్రాల పాత్ర ఎంతో కీలకం

## మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత



**కేసముద్రం,జూన్ 15 (జనం సాక్షి)** పిల్లల పోషణ,విద్య,ఆరోగ్య పరిరక్షణలో అంగన్వాడీ కేంద్రాల పాత్ర కీలకమని మున్సిపల్ చైర్ పర్సన్ బానోత్ సునీత వెంకన్న అన్నారు.మున్సిపాలిటీ పరిధిలోని రేకుల తండాలో అమ్మ మాట అంగన్వాడి బాట కార్యక్రమంలో పాల్గొని చైర్మన్ ప్రారంభించారు.అంగన్వాడీ కేంద్రాలలో పిల్లలను చేర్పించి వారి భవితకు పునాదులు వేయాలని వారు మాట్లాడారు.తమ పిల్లలను చేర్పించడానికి తల్లిదండ్రులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు.

# జర్నలిస్టును పరామర్శించిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు

## బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ తక్కల్లపల్లి రవీందర్ రావు



**నర్సంపేట. జూన్ 15 ( జనం సాక్షి)** నర్సంపేట పట్టణంలో సీనియర్ జర్నలిస్ట్ పాలంచ సత్యనారాయణపై జరిగిన దాడిని భారత రాష్ట్ర సమితి బిఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుంది. ఈ ఘటనపై మాజీ ఎమ్మెల్యే శ్రీ పెద్ది సుదర్శన్ రెడ్డి .సూచన మేరకు. సోమవారం సందర్శించే ఆయనతో మాట్లాడినట్లు తక్కలపల్లి రవీందర్రావు తెలిపారు. దాడి మీద స్పందిస్తూ జర్నలిస్టులపై ఇలాంటి భౌతిక దాడులకు పాల్పడటం ప్రజాస్వామ్యానికే ప్రమాదం అని పేర్కొన్నారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులకు రక్షణ కల్పించి శాంతిభద్రతలను కాపాడాలని కోరారు దాడి జరిగి నాలుగు రోజులు గడుస్తున్న ఇప్పటివరకు నిందితుని అరెస్టు చేయలేదు.. ఈ ప్రభుత్వంలో ప్రభుత్వ అధికారులకు రక్షణ లేదు జర్నలిస్టులకు రక్షణ లేదు దాడులు నిత్య కృత్యంగా మారాయి. నర్సంపేట పట్ట ణంలో అడుగుతున్న ఇలాంటి సంఘటన పట్ల పోలీసులు తక్షణ చర్యలు తీసుకోవడంతో పాటు పట్టణ ప్రజలకు రక్షణ కల్పించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేస్తున్నాం ఈ కార్యక్రమంలో మాజీ రాష్ట్ర ఖానీజా ఆబివృద్ధి సంస్థ డైరెక్టర్ నాడం శాంతి కుమార్ . పార్టీ కౌన్సిలర్ మండల శ్రీదేవి. శ్రీనివాస్ . కాంటెస్టెడ్ కౌన్సిలర్లు పెండమ్ శివానంద . మోతే తిరుపతి రెడ్డి . బీరం నాగిరెడ్డి పార్టీ నాయకులు నాడం నగేష్ జగ్గారావు మరియు ఇతర నాయకులు పాల్గొన్నార.ు

# ఆదర్శంగా టీచర్ ప్రభావతి



**బచ్చన్నపేట జూన్ 15 ( జనం సాక్షి):** జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం ఇటికాల పల్లి గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ సెకండరీ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు పి ప్రభావతి (సోషల్ టీచర్ ) తన కుమారున్ని తాను పనిచేస్తున్న పాఠశాలలో పదవ తరగతిలో చేర్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులతోపాటు ప్రభుత్వ ఉద్యోగాల పిల్లలను ప్రభావతి టీచర్ లాగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తే పాఠశాలలు బలోపేతం అయితాయని ప్రభావతి టీచర్ తన కుమారుని ప్రభుత్వ పాఠశాలలో చేర్పించి అందరికీ ఆదర్శంగా నిలిచిందని గ్రామ ప్రజలు ఆమెను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఇర్రి వెంకట్ రెడ్డి. ఉపాధ్యాయులు జీవరత్నం. విష్ణు. శ్రీనివాస్. సంతోష. ఆదేశ్. ఐజాక్. ముస్తఫా తోపాటు ఉపాధ్యాయ బృందం ప్రభావతి కి అభినందనలు తెలియజేశారు

# నకిలీ విత్తనాలతో రైతులు మోసపోకుండా చర్యలు తీసుకోవాలి



**గంగారం జూన్ 15 (జనం సాక్షి)** రైతుకు కావలసిన విత్తనాలను నాణ్యమైన అందించాలని కల్తీ విత్తనాలపై గట్టిగా నిఘ ఏర్పాటు చేయాలని అఖిలభారత ఐక్య రైతు సంఘం మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు పూనెం ప్రభాకర్ అన్నారు. గంగారం మండలం ఎమ్మార్వో కు వినతిపత్రం ఇచ్చారు. ముఖ్యఅతిథిగా హాజరై అయన మాట్లాడుతూ వర్షాకాలం సీజన్ ప్రారంభమైందని రైతాంగానికి అవసరమగు విత్తనాలను నాణ్యమైనవి, సరిపడ అందుబాటులో ఉంచాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాలలో ఇప్పటికే నకిలీ విత్తనాలు రాజ్యమేలుతున్నాయని, పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న విత్తన కంపెనీలు రైతులను మోసం చేస్తున్నాయని అన్నారు. టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసి నకిలీ విత్తనాలను అరికట్టాలని కోరారు. ప్రభుత్వ అధికారుల తనిఖీలలో దొరుకుతున్న నకిలీ విత్తన సరఫరాదారులపై పీడీ యాక్ట్ క్రిమినల్ కేసులు పెట్టి కఠినంగా శిక్షించాలని అన్నారు. రైతాంగం అత్యాశకు పోయి అధిక దిగుబడుల పేరుతో మోసపోవద్దని ప్రతి విత్తన ప్యాకెట్ కు కచ్చితంగా రసీదు అడగాలని అన్నారు. ఇంకా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలు ముఖ్యంగా ఎరువుల ధరలు తగ్గించాలని, బ్యాంకు రుణాలు సకాలంలో అందించాలని అమెరికా యూరప్ దేశాలతో వ్యవసాయ దిగుమతుల ఒప్పందాలను రద్దు చేయాలని తదితర డిమాండ్లతో అఖిలభారత ఐక్య రైతు సంఘం ఉద్యమాలు నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు. రైతాంగం పెద్ద ఎత్తున పోరాటాలలో భాగం కావాలని ఆయన పిలుపునిచ్చారు. అఖిలభారత ఐక్య రైతు సంఘం మహబూబాబాద్ డివిజన్ కార్యదర్శి ఈక బిక్షం, జిల్లా నాయకులు కురుసం రంగయ్య,డివిజన్ నాయకులు సురేష్, పులసం నాగార్జున, గుంట నరసింహారావు, పులసం చంద్రయ్య,చుంచ పాపాయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్పందించిన ఎమ్మార్వో బాలకృష్ణ ఉన్నతాధికారులకు తెలియజేసి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

# మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంది

## ఎమ్మెల్యే మురళి నాయక్



**కేసముద్రం,జూన్ 15 (జనం సాక్షి):** మహిళా సాధికారతకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే మురళి నాయక్ అన్నారు.మండలంలోని మహమూద్ పట్నం గ్రామంలో మహిళా శక్తి భవనానికి భూమి పూజ చేసి శంకుస్థాపన చేసి ప్రారంభించారు.స్వయం సహాయక సంఘాల మహిళలు సమావేశాలు ఏర్పాటు చేసుకొని శిక్షణ కార్యక్రమాల ద్వారా మహిళా శక్తి భవనాలను ఉపయోగించుకోవాలని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళా శక్తి భవనానికి 10 లక్షల రూపాయలు మంజూరు చేసిందని వారు తెలిపారు.సెర్ఫ్ మహిళా శక్తి భవనాలు మంజూరు చేసి వారి యొక్క సమస్యలు పరిష్కరించుకోవడంలో కార్యాలయాలు సద్వినియోగపరచుకోవాలని కోరారు.జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి అంబటి మహేందర్ రెడ్డి,జిల్లా యూత్ అధ్యక్షులు అజ్మీర సురేష్ నాయక్,బండారు వెంకన్న,ఎంపీడీవో క్రాంతి,ఎంపీ ఓ హరీష్,ఎస్సై క్రాంతి కిరణ్,మహమూద్ పట్నం గ్రామ సర్పంచ్ కట్ల ఎల్లయ్య,ఉపసర్పంచ్ ఏశబోయిన అమృత శ్రీనివాస్,వార్డు మెంబర్లు సోమయ్య,లచ్చుమ్మ,వివోలు సంధ్య,భూక్య నెహ్రూ,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మిట్టగడుపుల యాకూబ్,బద్దుల వెంకటమల్లు, చిలువేరు లింగయ్య,బద్దుల తిరుపతి,మాజీ ఎంపీటీసీ ముంజాల శ్రీనివాస్,యాకయ్య, యాకాంత చారి,వెంకన్న,నరసయ్య,ఉపేందర్, భూక్యారం తండా సర్పంచ్ జాటోత్ సోమీ,తౌర్య తండా సర్పంచ్ బుజ్జి శంకర్ నాయక్,మాజీ సర్పంచ్ సిలివేరు భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

# మాదారం బడిలో పుస్తకాల పంపిణీ



**తాండూర్, జూన్ 15( జనం సాక్షి)** విద్యా సంవత్సరం ప్రారంభోత్సవం పురస్కరించుకొని సోమవారం రోజున ప్రాథమిక పాఠశాల మాదారం నందు మరియు పోచంపల్లి పాఠశాల నందు విద్యార్థిని ,విద్యార్థులు అందరికి ఒక పండగ వాతావరణంలో ఘన స్వాగతం పలకడం జరిగింది. మరియు మాదారం అంగన్వాడి కేంద్రాలు అంగన్వాడి సెంటర్ 3.5.9 సెంటర్లో అమ్మ మాట అంగన్వాడి బాట నిర్వహించినారు,ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గ్రామ సర్పంచ్ కుశనపల్లి లక్ష్మణ్ మరియు ఉప సర్పంచ్ సూరం దామోదర్ రెడ్డి పాల్గొనడం జరిగింది.విద్యార్థులకు స్వాగతం పలుకుతూ అంగన్వాడి సెంటర్స్ కి స్వాగతం పలికారు, ఈ కార్యక్రమంలో పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులందరికీ ముఖ్య అతిథులచేత టెక్ట్స్ బుక్స్ మరియు నోట్ బుక్స్ అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో మాదారం, పోచంపల్లి ప్రధానోపాధ్యాయురాలు,మీసాశిరీష,మాదారంప్రధానోపాధ్యాయురాల ు శ్రీలక్ష్మి మరియు విద్యాసాగర్ మరియు మౌనిక వార్డు మెంబర్ బానేష్,అంగన్వాడి టీచర్లు కుసనపల్లి మీనా నడిపెల్లి యాజలక్ష్మి హెల్పర్స్ లావణ్య రాధా మరియు కిషోర్ బాలికలు విద్యార్థుల తల్లిదండ్రులు తదితరులు పాల్గొనడం జరిగినది పాల్గొన్నారు.

# సర్కారు బడిలోనే నాణ్యమైన విద్య : తాండూర్ ఎంఈవో శ్రీనివాస్




**తాండూర్, జూన్ 15( జనం సాక్షి)** మంచిర్యాల జిల్లా :తాండూర్ మండలంలో ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన జరుగుతోందని తాండూర్ ఎంఈవో శ్రీనివాస్ తెలిపారు.తాండూర్ సర్పంచ్ ముడిమడుగుల సురేష్ ఆధ్వర్యంలో పాఠశాలల పునఃప్రారంభం సందర్భంగా తాండూర్ జడ్.పి.హెచ్.ఎస్ లో నిర్వహించారు, ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్కారు బడుల బలోపేతానికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. అనంతరం విద్యార్థులకు ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులతో కలిసి నోట్బుక్కులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉ మండల విద్యాధికారి,ఉపాధ్యాయులు,ఉప సర్పంచ్,వార్డు సభ్యులు మరియు ఇతర నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొనడం జరిగింది.

# కలెక్టర్‌ను కలిసిన చింత నెక్కొండ గ్రామస్తులు



**పర్వతగిరి, జూన్ 15 (జనం సాక్షి)** వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం చింత నెక్కొండ గ్రామస్తులు సోమవారం వరంగల్ కలెక్టరేట్ గ్రీవెన్స్ లో కలెక్టర్ కు వినతిపత్రాన్ని అందించారు. చింత నెక్కొండ లోని పురాతనమైనటువంటి కాకతీయుల కాలం నాటి స్వయంభు రామలింగేశ్వర స్వామి దేవాలయంలో పూజలు నిర్వహించబడేవని, కాలక్రమేనా ముస్లింల దండయాత్రలో శివ మరియు రామ ఆలయాలతో అంశం కాబట్టి పూజలకు నోచుకోక శిథిలావస్థకు చేరుకున్నాయనీ వినతి పత్రంలో పేర్కొన్నారు. అయితే 1950 నుండి గ్రామంలో కేవలం రామాలయం లో కళ్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అయితే ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న శివాలయ ప్రాంగణంలోని ఫలకాలు, స్తంభాలు, వినాయక విగ్రహం, నందీశ్వర స్వామి, శివలింగములను పక్కనే పవిత్ర స్థలంలో కేటాయించిన త్రికోట ఆలయంలో పునర్నిర్మాణంలో భాగంగా కొత్త శిలలు పాత ఆలయంలో సేకరించిన స్తంభాలు శిలాఫలకాలు శివలింగం నందీశ్వరుడు వినాయక విగ్రహాలు పునర్ ప్రతిష్టించడం కోసం అనుమతి ఇవ్వాలని ఈ సందర్భంగా కలెక్టర్ కు గ్రామస్తులు విన్నవించారు. ఈ విషయంలో కలెక్టర్ డాక్టర్ సత్య శారద దేవాలయాలను కూల్చే అథారిటీ లేదని, కొత్తగా ఆలయం కట్టుకోవచ్చని , ఈ విషయంలో ఆర్డిఓ పరిశీలిస్తుందని చెప్పినట్లు గ్రామస్తులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జి .రమేష్ యాదవ్, ఉప సర్పంచ్ కవిత, పుష్పలత, గణేష్, శాంతిరథన్ రావు, రాజు, మల్లయ్య, దేవేందర్ చారి తదితరులు పాల్గొన్నారు.

# జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ ఇవ్వాలి

## టీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** జర్నలిస్టుల పిల్లలకు 50శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని కోరుతూ సోమవారం టీయూడబ్ల్యూజే ఐజేయూ ఆధ్వర్యంలో అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్ష కార్యదర్శులు క్యాతం సతీష్ కుమార్, సామంతుల శ్యామ్ లు మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో 50 శాతం ఫీజు రాయితీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమాజానికి సమాచార వారధులుగా పనిచేస్తూ ప్రజా సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లే జర్నలిస్టులు ఎన్నో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో ఫీజులు విపరీతంగా పెరిగాయి. దీంతో పిల్లలకు నాణ్యమైన విద్య అందించడం కష్టమవుతోంది. జిల్లాలో పనిచేసే విలేకరుల ఆదాయం పరిమితం. విద్యా భారం ఎక్కువవుతోంది. ఈ నేపథ్యంలో జర్నలిస్టుల సేవలను గుర్తించాలని కోరారు. వారి పిల్లలకు ప్రైవేట్, కార్పొరేట్ స్కూళ్లలో కనీసం 50 శాతం ఫీజు రాయితీ కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ప్రత్యేక విధానం రూపొందించాలని కోరింది. అదనపు కలెక్టర్‌తో పాటు జిల్లా విద్యాశాఖ అధికారికి కూడా వినతిపత్రాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హెల్త్ కమిటీ సభ్యుడు సామల శ్రీనివాస్, చిన్న పత్రికల సంఘం అధ్యక్షులు కుసుమ చంద్రశేఖర్, విజయ్, సుధాకర్, రామారావు, పవన్‌తో పాటు పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# పట్టాలు ఇప్పించాలని ఆర్డీవోకు వినతి



**నల్లబెల్లి, జూన్ 15 (జనంసాక్షి):** మండలంలోని కన్నారావుపేట, బుచ్చిరెడ్డి పల్లె, పద్మాపురం, పంతులు పల్లె గ్రామాలకు చెందిన రైతులు తమకు ఉన్నటువంటి వ్యవసాయ భూములకు పట్టాలి ఇప్పించాలని సర్పంచ్ పల్నాటి మూర్తి ఆధ్వర్యంలో ఆర్డీవో ఉమారానికి సోమవారం వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కన్నారావుపేట రెవెన్యూ పరిధిలోని 58వ సర్వే నెంబర్ లో గల 1400 ఎకరాల భూమిని మోక మీదున్న రైతులకు పట్టాలు చేయాలని విన్నవించుకున్నారు. ఎన్నో ఏళ్లు గా ఈ భూములలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వాలు మారిన పట్టాలు కావడం లేదంట్టు ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా 58వ సర్వే నెంబర్ లోని భూములకు పట్టాలి ఇప్పించాలని రైతులు వేడుకున్నారు. అలాగే కన్నరావుపేట, బుచ్చిరెడ్డి పల్లె గ్రామాల చెందిన రైతుల వ్యవసాయ భూముల నుండి సాగునీటి కోసం కెనాల్ కాలువ పోతున్నది. దీనివల్ల తమ జీవనోపాధి కోల్పోతున్నామని అట్టి కాల్వను రద్దు చేయాలని రైతులు ఆర్డీవో కు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సలుపు భద్రయ్య, వేముల సంపత్ రెడ్డి, రాజేందర్, దేవేందర్, కర్ణాకర్, సహదేవా, దేవేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యమైన విద్యను అందించటమే ప్రభుత్వ ధ్యేయం..




**కొడకండ్ల, జూన్ 15(జనం సాక్షి)** ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడమే ప్రభుత్వ ధ్యేయంగా పని చేస్తుందని కొడకండ్ల సర్పంచ్ దూలం మమత సతీష్ గౌడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తెలంగాణ బాలికల రెసిడెన్సియల్ పాఠశాలలో05వ తరగతి చదువుతున్న విద్యార్థినీలకు పాఠశాల ప్రారంభోత్సవం ను ప్రిన్సిపాల్ తమ్మీ దిలీప్ తో కలిసి కేక్ కట్ చేసి ఘనంగా స్వగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థినిలు గురుకుల పాఠశాలను సద్వినియోగం చేసుకొని రాణించాలని సూచించారు. పాఠశాల ను నెంబర్ వన్ స్థానం లో నిలుపుతున్న ఉపాధ్యాయులను అభినందించారు.అనంతరం నోట్ బుక్స్, దుప్పట్లను పంపిణీ చేశారు. విద్యార్థులు, తల్లి దండ్రులు పాల్గొన్నారు.

# అక్రమ ప్రమోషన్లను వెంటనే రద్దు చేయాలి




**నిర్మల్ టౌన్,జూన్15,(జనంసాక్షి)** అక్రమ ప్రమోషన్లను వెంటనే రద్దు చేయాలని విద్యుత్ శాఖ నిర్మల్ సర్కిల్ ఎస్సీ కార్యాలయం ముందు 1104 యూనియన్ కార్మికులు గురువారం సాయంత్రం ఎదుట ధర్నా చేపట్టారు. జిల్లాలోని భైంసా, ఖానాపూర్, నిర్మల్ డివిజన్ల నుంచి కార్మికులు భారీగా తరలివచ్చారు. అక్రమ ప్రమోషన్లు రద్దు చేయాలని, పోస్టింగుల్లో జరిగిన అన్యాయం సరిచేయాలని డిమాండ్ చేస్తూ ఎత్తున నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో నిర్మల్ జిల్లా యూనియన్ అధ్యక్షులు శ్రీనివాస్ రాజు, కార్యదర్శి పోచయ్య, జిల్లా సలహాదారు రేగుంట రాజేశ్వర్, నిర్మల్ డివిజన్ కార్యదర్శి మనోహర్ స్వామి, అధ్యక్షులు ఖ. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

# ప్రీ ప్రైమరీ స్కూల్స్ మంజూరు చేయాలి

## బిజెపి రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు నవునూరి సుధీర్ గౌడ్



**తాండూర్, జూన్ 15(జనం సాక్షి)** బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నవునూరీ సుదీర్ గౌడ్ గారి ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి లో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ గారికి కేంద్ర సమగ్ర శిక్ష నూతన విద్యా విధానంలో భాగంగా మంచిర్యాల జిల్లాకు 72 ప్రీ ప్రైమరీ స్కూల్స్ రావడం జరిగింది అందులో తాండూర్ మండలంకు ఒక్కటి కూడా కేటాయించకపోవడం బాధాకరమని తెలియజేయడం జరిగింది మంచిర్యాల జిల్లాలో తాండూరు మండలం పెద్ద మండలం అయినప్పటికీ అందులో తాండూర్, తంగళ్ళపల్లి, అచ్చలపూర్, రేచిని హై స్కూల్ లలో ప్రతి సంవత్సరం విద్యార్థులు అధిక సంఖ్యలో పాస్ అవుట్ అవుతున్నారు ఇలాంటి మండలంకు కచ్చితంగా ప్రీ ప్రైమరీ స్కూల్స్ కేటాయించాలని కోరడం జరిగింది వెంటనే కలెక్టర్ గారు దీనికి స్పందించి డిఈఓ గారికి పంపించడం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా బీజేవైఎం జిల్లా ప్రధానకార్యదర్శి ఏముర్ల ప్రదీప్, బిజెపి తాండూర్ మండల ఉపాధ్యక్షులు కొండు రవి, రేవెల్లి శ్రీనివాస్, బీజేవైఎం మండల ప్రధానకార్యదర్శి అద్వాల సతీష్ నాయకులు వరిమడ్ల విజయ్, దేవ నరేష్ తదితరులు పాల్గొన్నారు...

# సీనియర్ పాత్రికేయులు సత్యనారాయణ పై దాడిని ఖండిస్తూ డివిజన్ జర్నలిస్టుల ఆధ్వర్యంలో ధర్నా




**నర్సంపేట జూన్ 15 (జనం సాక్షి)** నర్సంపేట పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్టు పాల్వంచ సత్యనారాయణ పై ఈనెల 12న రాత్రి గుర్తు తెలియని వ్యక్తి బీర్ సీసాతో దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటనపై నర్సంపేట జర్నలిస్టులు తీవ్రంగా ఖండిస్తూ పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ పై దాడి చేసిన వ్యక్తిని గుర్తించి అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని, జర్నలిస్టుల ఐక్యత వర్ధిల్లాలని, పాత్రికేయుల పై దాడులు చేయడం హేయమైన చర్య అని నినాదాలు చేశారు. దాడికి పాల్పడిన వ్యక్తిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఆర్డీవోకు వినతి పత్రం అందజేత సీనియర్ జర్నలిస్టు సత్యనారాయణపై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ డివిజన్ జర్నలిస్టులు రాస్తారోకో అనంతరం స్థానిక ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కు చెందిన జర్నలిస్టులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు

## విద్యార్థులకు టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్ అందజేత



**నల్లబెల్లి, జూన్ 15 (జనంసాక్షి):** మండలంలోని నారక్క పేట ఎంపీపీఎస్ పాఠశాలలోని విద్యార్థులకు సర్పంచ్ దండెం సంపత్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు సదానందం గౌడ్ ఆధ్వర్యంలో టెక్స్ట్ బుక్స్, నోట్ బుక్స్ లను సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, యూనిఫామ్ లతో పాటు మార్నింగ్ అల్పాహారం, మధ్యాహ్న భోజనాన్ని ప్రభుత్వం అందజేస్తుందని పేర్కొన్నారు. విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలలో ఉన్నతమైన విద్య అందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, పంచాయతీ కార్యదర్శి బాలు, సిఆర్పి రాజేందర్ పాల్గొన్నారు.

## రక్తదానం.. మరొకరికి ప్రాణదానం



**పర్వతగిరి: జున్ 14 : (జనం సాక్షి)** రక్తదానం చేయడం వల్ల మరొకరికి ప్రాణదానం చేసినట్లే అని రక్తదాత, హనుమకొండ జిల్లా ట్రైబల్ వర్కింగ్ జర్నలిస్ట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఇస్లావత్ దేవేందర్ తెలిపారు. ఆదివారం అంతర్జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా హనుమకొండలోని రెడ్ క్రాస్ లో రక్తదానం చేసినట్లు దేవేందర్ పేర్కొన్నారు. రక్తదానం చేయడం వల్ల అత్యవసర సమయాల్లో మరొకరికి జీవం పోసినట్టు అని చెప్పారు. ఇప్పటికీ 11సార్లు రక్తదానం చేసినట్లు చెప్పారు. ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రక్తదాత మోటివేటర్ కన్నె రాజు , రెడ్ క్రాస్ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం..

### కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్




**కేసముద్రం,జూన్ 15 (జనం సాక్షి):** విద్యార్థులను గణితంలో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా వినూత్న పద్ధతులను అమలు చేస్తున్నామని శ్రీ వివేకవర్ధని హై స్కూల్ కరస్పాండెంట్ చిర్ర యాకాంతం గౌడ్ అన్నారు. విద్యార్థుల్లో గణితంపై ఆసక్తి పెంపొందించి,వారి గణన సామర్థ్యాలను మెరుగుపరిచేందుకు పాఠశాల యాజమాన్యం ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు వేదిక్ మ్యాథ్స్,అభాకస్ మ్యాథ్స్ అంశాలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. నేటి పోటీ ప్రపంచంలో గణితానికి అత్యంత ప్రాధాన్యత ఉందన్నారు. విద్యార్థులు గణితాన్ని సులభంగా అర్థం చేసుకొని,వేగంగా లెక్కలు చేయగలిగే నైపుణ్యాలను పెంపొందించేందుకు వేదిక్ మ్యాథ్స్,అభాకస్ వంటి ఆధునిక బోధనా విధానాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొని వేదిక్ మ్యాథ్స్,అభాకస్ పద్ధతులపై శిక్షణ పొందారు. విద్యార్థులలో తార్కిక ఆలోచన,ఏకాగ్రత,వేగవంతమైన గణన సామర్థ్యాల పెంపుదలకు ఈ విధానాలు దోహదపడతాయని నిర్వాహకులు తెలిపారు.

## మృతుడి కుటుంబానికి తోటి క్లాస్మేట్‌ల ఆర్థిక సహాయం



**పాలకుర్తి, జూన్ 15 (జనంసాక్షి)** పాలకుర్తి మండలంలోని తొర్రూర్ గ్రామానికి చెందిన గాదరి సోమ నరసయ్య ఇటీవల అనారోగ్యంతో మృతిచెందగా, బాధిత కుటుంబానికి తనతో చదువుకున్న 2003-2004 బ్యాచ్‌కి చెందిన తోటి క్లాస్మేట్స్ 30 వేల ఆర్థిక సహాయం అందించారు. దీంతోపాటు 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. మృతుడికి భార్య. ఇద్దరు కూతుర్లు ఒక కుమారుడు ఉన్నారు. రానున్న రోజుల్లో కూడా స్నేహితుడు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని తోటి క్లాస్మేట్స్ భరోసా ఇచ్చారు.

## పాఠశాల మన భవిష్యత్తు అంటూ స్వాగత తోరణాలు కట్టిన ఉపాధ్యాయులు




**గంగారం జూన్ 15 (జనం సాక్షి)** వేసవి సెలవుల తర్వాత స్కూళ్లు తెరుచుకోవడంతో గంగారం మండలం కామారం గ్రామపంచాయతీ బర్ల గుంపు పాఠశాల ఉపాధ్యాయులు చాట్ల నాగేశ్వరరావు, వీర్లాల్ వినూత్నంగా విద్యార్థులకు స్వాగతం పలికారు. "మన పాఠశాల మన భవిష్యత్తు" అనే నినాదంతో స్కూల్ గేటును పూల తోరణాలు, బెలూన్లతో అలంకరించి, డప్పు చప్పుళ్లతో విద్యార్థులను లోపలికి ఆహ్వానించారు.

**ఉపాధ్యాయుల సృజనాత్మకత:**

పాఠాలు సులువుగా అర్థం కావాలనే ఉద్దేశంతో ఉపాధ్యాయులు ఆటపాటలతో బోధన ప్రారంభించారు. హెడ్‌మాస్టర్ స్వయంగా జోకర్ వేషధారణలో, మిగతా టీచర్లు కథలు చెప్తూ, పాటలు పాడుతూ పిల్లల్లో భయం పోగొట్టారు. "పిల్లలకు స్కూల్ అంటే భయం కాదు, భరోసా కావాలి. అందుకే మొదటి రోజు చదువు కంటే చిరునవ్వు ముఖ్యం అనుకున్నాం" అని స్కూల్ హెడ్మాస్టర్ చాట్ల నాగేశ్వరరావు తెలిపారు. "స్కూల్‌కి వస్తే టీచర్లు ఇలా డాన్స్ చేస్తూ, కథలు చెప్తారని అనుకోలేదు. రోజూ స్కూల్‌కి రావాలనిపిస్తోంది" అని పిల్లలు ఆనందం వ్యక్తం చేశాడు. బడి మౌలిక సదుపాయాల కల్పనకు ఉపాధ్యాయులు తమ వంతు సాయం చేస్తూ, తరగతి గదులను రంగుల చిత్రాలతో అలంకరించారు. "మన పాఠశాల మన భవిష్యత్తు" అనే నినాదాన్ని ప్రతి గదిలో రాసి, విద్యార్థుల్లో సొంత బడిపై ప్రేమ పెంచేలా కృషి చేస్తున్నారు. పిల్లలకు మొదటి రోజే పాఠ్యపుస్తకాలు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఉపాధ్యాయులు పిల్లలకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని ఇలానే ప్రతిరోజు పండుగ వాతావరణం లో స్కూల్ చెప్పాలని ఎంఈఓ రమాదేవి అన్నారు.

## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య

- తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలి
- పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు బేతి మంజుల




**స్టేషన్ ఘన్‌పూర్ , జూన్ 15 ( జనం సాక్షి ) :** ప్రభుత్వ పాఠశాలల్లోనే విలువలతో కూడిన నాణ్యమైన విద్య లభిస్తుందని తల్లిదండ్రులు తమ పిల్ల లను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాల ని పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షురాలు బేతి మంజుల,ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెనుమాటి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని తాటికొండ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు అధ్యక్షతన విద్యార్థి ని విద్యార్థులకు ఉచిత పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్ లు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతసంవత్సరం తాటికొండ ఉన్నత పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని, ఈ విద్యా సంవత్సరంలో మరిన్ని మంచి ఫలితాల సాధన కోసం గ్రామంలోని విద్యా ర్థులందరినీ స్థానిక ఉన్నత పాఠశాలలోనే చేర్పిం చాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే విలువల తో కూడిన నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్ లు, ఉచిత యూని ఫాం లు, టిఫిన్,బోజన సదుపాయాలు ఉన్నాయ ని తెలిపారు. విద్యార్థులకు చదువుతో పాటు ఆట లు,పాటలు వంటి మొదలైన సాంస్కృతిక కార్య క్రమాలు కూడా నిర్వహించబడతాయని, తల్లి దం డ్రులు ప్రతినెల విద్యార్థుల ప్రగతిని ఉపాధ్యాయు ల ద్వారా తెలుసుకోవచ్చుని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి ప్రజలందరూ సమిష్టిగా కృషిచేయాలని అన్నారు. తల్లిదండ్రులు తమ పిల్ల లను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పెనుమా టి వెంకటేశ్వర్లు,ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై చర్య తీసులోవాలి

### ఎంఈఓకు వినతిపత్రం అందించిన ఏఐఎస్ఎఫ్



**స్టేషన్ ఘన్‌పూర్ , జూన్ 15 ( జనం సాక్షి ) :** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్యపుస్తకా లు విక్రయిస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వ ర్యంలో ఎంఈఓ కు వినతిపత్రం అందచేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఏఐఎస్ఎఫ్ జిల్లా నాయ కుడు పస్తం పృథ్వీరాజ్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు తమఇష్టానుసారంగా ప్రభుత్వ నిబం ధనలు తుంగలో తొక్కి పాఠశాలలోనే పాఠ్య పుస్త కాలు విక్రయిస్తున్నారని అన్నారు. మార్కెట్ రేట్ కంటే ఎక్కువ పెట్టి అమ్ముతున్నారని విద్యార్థుల తల్లితండ్రులు పిల్లల చదువు కోసం తమ రెక్కలు ముక్కలు చేసుకొని కష్ట పడుతుంటే వారి శ్రమను ప్రైవేట్ పాఠశాలలు ఫీజుల రూపంలో యూనిఫా మ్ రూపంలో పాఠ్యపుస్తకాల రూపంలో దోచుకుం టున్నాయని మండిపడ్డారు. ప్రైవేట్ పాఠశాలల్లో పాఠ్యపుస్తకాలు విక్రయిస్తే సహించేదిలేదని అన్నా రు ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు బానోత్ తిరుపతి,బుస్సా రోహిత్, భూక్యా అంజి, అరుణ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి కాన్ఫరెన్స్‌లో డా॥ వేణుగోపాలకృష్ణకు విశేష ప్రశంసలు



**నిర్మల్, జూన్ 15(:జనంసాక్షి)** నిర్మల్‌కు చెందిన ప్రముఖ వైద్యులు డా, వేణుగోపాలకృష్ణ రాష్ట్ర స్థాయి బయోకెమిస్ట్రీ కాన్ఫరెన్స్‌లో విశేష ప్రశంసలు అందుకున్నారు. గతంలో ఉత్తమ వైద్యునిగా, సూపరింటెండెంట్‌గా, ఆర్ఎంఓగా సేవలందించి ప్రభుత్వ ప్రశంసలు పొందిన ఆయన పలు జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయి పురస్కారాలు అందుకున్నారు. కళారంగంలోనూ ప్రతిభ కనబరిచి నంది పురస్కారాలు సైతం పొందారు. ప్రస్తుతం నిజామాబాద్ ప్రభుత్వ వైద్య కళాశాలలో బయోకెమిస్ట్రీ విభాగంలో ఎండీ అభ్యసిస్తున్న డా॥ వేణుగోపాలకృష్ణ, 7వ రాష్ట్ర స్థాయి ఏఎమ్ బిఐ కాన్ఫరెన్స్‌లో బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ అంశంపై పేపర్ ప్రజెంటేషన్ చేసి సీనియర్ వైద్యులు, నిపుణుల ప్రశంసలు అందుకున్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో అధ్యక్షులు, నిర్వాహక కమిటీ సభ్యులు, వివిధ వైద్య కళాశాలల అధిపతులు, న్యాయ నిర్ణేతలు పాల్గొని డా వేణుగోపాలకృష్ణను అభినందించారు. కార్యక్రమంలో నిర్మల్ ప్రభుత్వ వైద్యశాల ప్రిన్సిపల్, రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ శారద, కాకతీయ వైద్య కళాశాలకు చెందిన డాక్టర్ పుల్లయ్య, డాక్టర్ రమా, డాక్టర్ జయ, డాక్టర్ ఠాగూర్ తదితరులు పాల్గొన్నారు. డా, వేణుగోపాలకృష్ణ సాధించిన ఈ గుర్తింపు నిర్మల్ జిల్లాకు గర్వకారణమని పలువురు వైద్యులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

# రాజీతో కేసు పరిష్కరించుకుంటే సమయం, డబ్బు ఆదా

**జడ్జి కన్నయ్య లాల్**

**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** రాజీతో కేసు పరిష్కరించుకుంటే సమయం, డబ్బు ఆదా అవుతుందని సీనియర్ సివిల్ జడ్జి టి. కన్నయ్య లాల్ చెప్పారు. భూపాలపల్లిలో సోమవారం న్యాయవాదులు, కోర్టు కానిస్టేబుల్స్‌తో వేరు వేరుగా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఈ నెల 20న జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌లో పెద్ద ఎత్తున కేసులు పరిష్కరించాలని పిలుపునిచ్చారు. లోక్ అదాలత్‌లో ఇరువర్గాలు స్నేహపూర్వకంగా సమస్యలు పరిష్కరించుకుంటే ఏళ్ల తరబడి సాగే కోర్టు ప్రక్రియ తప్పుతుందని తెలిపారు. విలువైన సమయం, డబ్బు వృధా కాకుండా,



మనశ్శాంతి దొరుకుతుందని చెప్పారు. సివిల్ కేసుల్లో రాజీకి వచ్చిన వారికి కట్టిన కోర్టు ఫీజు తిరిగి ఇస్తామని జడ్జి హామీ ఇచ్చారు. దీంతో సామాన్య ప్రజలు ఆర్థిక భారం లేకుండా న్యాయం పొందవచ్చు. భూ తగాదాలు, చెక్కు బౌన్స్, చిన్న సివిల్ వివాదాలు ఉన్న వారికి ఇది మంచి అవకాశమని, జిల్లా కోర్టులో లోక్ అదాలత్‌ను విజయవంతం చేసేందుకు కృషి చేయాలని న్యాయవాదులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.అఖిల, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆకుల రాములు, అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్ ఇందరపు శివకుమార్, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ పుప్పాల శ్రీనివాస్, డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సెల్ కంప అక్షయతో పాటు న్యాయవాదులు భూక్యా రమేష్ నాయక్, మొయినుద్దీన్, సంధ్య, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది, కోర్టు కానిస్టేబుల్స్ పాల్గొన్నారు.



# 17న రైతు సంఘం జిల్లా మహాభను జయప్రదం చేయండి

## సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు

## జువారి రమేష్

స్టేషన్ ఘన్‌పూర్ , జూన్ 15 ( జనం సాక్షి ): ఈ ఈ నెల 17న జరుగు రైతు సంఘం జిల్లా మహాభ ను జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు జువారి రమేష్ పిలుపునిచ్చారు.జాఫర్ గడ్ మండల కేంద్రంలో ముఖ్య కార్యకర్తల సమా వేశం రైతు సంఘం మండల అధ్యక్షుడు ఎండీ యాకుబ్ పాషా అధ్యక్షతన జరగగా, ముఖ్యఅతి థిగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు, మండల కార్యదర్శి జువారి రమేష్ పాల్గొని మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై రైతులు ఏకంకావాలని పిలుపునిచ్చా రు. రాబోయే రోజుల్లో రైతుల పరిస్థితి గడ్డుకాలం గా మరే అవకాశంఉందని,కేంద్రప్రభుత్వం సబ్సిడీ లను ఎత్తేసే కుట్రలు పన్నుతుందన్నారు. చిన్న సన్నకారు రైతులకు కన్నీళ్ళు తప్ప మరొకటి లేద ని, ఇప్పటిదాకా వడ్లు కొనుగోలు కేంద్రాల్లో ఉండ టం శోచనీయం అని ఆయన ఆవేదన వ్యక్తం చేశా రు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై నిరంత రం అలుపెరుగని పోరాటంచేస్తున్నా రైతుసంఘం జిల్లా మహాసభ మండల కేంద్రంలోని ఆర్యవైశ్య ఫంక్షన్ హాలులో జరుగుతుందని,ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పశ్య పద్మ హాజరవుతారని,రైతుసోదరులు అధిక సంఖ్యలో వచ్చి జయప్రదం చేయాలని కోరారు. ఈసమావేశంలో మహిళసమాఖ్య జిల్లాకార్యదర్శి ఎండీ నూర్జున్నిసా, రైతు సంఘం మండల కార్య దర్శి పెండ్యాల సమ్మ య్య, మంద బుచ్చయ్య, బుల్లె దూడయ్య, కలకో టి యాదగిరి, బత్తిని శ్రీను గౌడ్, కస్తూరి ఎల్లయ్య, శివరాత్రి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వర ఆలయ పునర్నిర్మాణ పనులు

దక్షిణ భారత ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, త్రిలింగ క్షేత్రమైన కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణానికి సర్వం సిద్ధమైంది. శృంగేరి శారద పీఠాధిపతుల దిశానిర్దేశం, ఆధ్యాత్మిక అనుబంధంతో సుమారు రూ.198 కోట్ల వ్యయంతో ఈ కార్యాన్ని చేపడుతున్నారు. ఈనెల 17న ఉదయం 8.15 గంటలకు శృంగేరి శిష్య బృందం ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా తొలగింపు పూజలు నిర్వహించనున్నారు. ముందుగా ద్విలింగాలు , శుభానంద దేవి అమ్మవార్ల విగ్రహాలకు కళాపకర్షణ చేయనున్నారు. ఆ విగ్రహాలలోని శక్తిని కలశాలలో నిక్షిప్తం చేసి నిర్మాణాలు పూర్తయిన తర్వాత మరల విగ్రహాలలోకి ఆ శక్తిని పంపనున్నారు. వచ్చే ఏడాది జరిగే గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని, ఆలోపే ప్రధాన గర్భగుడి పనులు పూర్తి చేయాలని సంకల్పించారు.

ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా ప్రధాన గర్భగుడి లోని అత్యంత పవిత్రమైన ద్విలింగాల పానవట్టం కొలతలను తమిళనాడుకు చెందిన ప్రముఖ శిల్పులు ఇప్ప టికే గురువారం సేకరించారు. గర్భగుడిలోని ద్విలింగాల నమూనాను అదే కొలతలతో ఆది ముక్తీశ్వరాలయం లోని బాలాలయంలో ప్రతిష్ఠించనున్నారు. పాత నిర్మా ణాల తొలగింపు సమయంలో గర్భగుడిలోని ప్రధాన ద్విలింగాలకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా, వాటి పైభాగంలో ఇనుముతో కూడిన ప్రత్యేక పైకప్పు రక్షణ కవచాన్ని ఏర్పాటు చేస్తున్నారు. కాళేశ్వర ముక్తీశ్వర ఆలయంలో పాత ఇటుక, సిమెంట్ కట్టడాలను, అనుబంధ ఆలయాలను, ప్రాకారాలను, రాజగోపురాలను పూర్తిగా తొలగించనున్నారు. భవిష్యత్ తరాల కోసం కృష్ణశిలలతో (రాతి కట్టడాలు) ఆలయాన్ని అద్భుతంగా నిర్మించనున్నారు. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల లోగా ప్రధాన గర్భగుడితోపాటు శుభానందాదేవి అమ్మవారి ఆలయం, సరస్వతీదేవి ఆలయాల నిర్మాణాలను ప్రాధాన్య క్రమంలో పూర్తి చేసి భక్తులకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు.

# గంగదేవిపల్లి పాఠశాలలో అల్పాహారం ప్రారంభోత్సవం

**గీసుకొండ మండలం, జూన్ 15, (జనం సాక్షి) :** గంగదేవిపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు మండల ప్రాథమిక పాఠశాలలోలి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ముఖ్యమంత్రి అల్పాహార పథకంను గ్రామ సర్పంచ్ కూసం స్వరూప్-రమేష్ ఘనంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా విద్యార్థులకు పోషకాహారంతో కూడిన అల్పాహారాన్ని అందజేసి, వారి ఆరోగ్యం, విద్యాభివృద్ధికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. సర్పంచ్ కూసం స్వరూప్-రమేష్ మాట్లాడుతూ, ఆరోగ్యవంతమైన విద్యార్థులే రేపటి సమాజ నిర్మాణ శిల్పులులి అని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఆరోగ్యంగా ఉండి చదువులో రాణించేందుకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రతిరోజూ సకాలంలో పాఠశాలకు పంపించి ఈ అవకాశాన్ని సద్వినియోగం



చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో లివీఓ అధ్యక్షురాలు నాగిరెడ్డి లావణ్య, గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు మరియు గ్రామ ప్రజలులి పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని అందరూ అభినందించారు.

# పేదింటి ఆడబిడ్డలకు అండగా ప్రజా ప్రభుత్వం

**కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ చేసిన ఎమ్మెల్యే నాయిని**



**హనుమకొండ ప్రతినిధి జులై 15 (జనం సాక్షి) :** ప్రజా ప్రభుత్వంలో ప్రతి అర్హులైన కుటుం బానికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి తెలిపారు. సోమవారం బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నియోజకవర్గ పరిధిలోని 106 మంది లబ్ధిదారులకు రూ.1,06,12,296 విలువగల కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ పేద కుటుంబాల ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తోందన్నారు. మహిళా సాధికారతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆ దిశగా అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ప్రజావాణి దరఖాస్తులు సత్వరమే పరిష్కరించాలి

అటవీ శాఖ వారు అడ్డుపడుతున్నారని, తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దహేగం మండలం ఐనం గ్రామ సర్పంచ్ ఎల్ములే ప్రశాంత్ తమ గ్రామంలో విద్యుత్ స్తంభాలు వంగి ఉన్నందున సరి చయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. రెబ్బెన మండలం కైరుగాం పంచాయతీ పరిధిలో ఎడవెల్లి గ్రామానికి చెందిన రైతులు తమ పంట పొలాలకు వట్టివాగునీరు అందించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. కౌటాల మండలం బాలేపల్లి కి చెందిన లడే సాయి ప్రసాద్ తనకు 8వ తరగతిలో గురుకుల పాఠశాలలో సీటు ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. దహేగాం మండలం కోతిమీర్ గ్రామానికి చెందిన రెడ్డి రాజయ్య తనకు బ్యాంకు నుండి రుణం ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని, పెండింగ్ లో లేకుండా పర్యవేక్షించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

# అట్టహాసంగా పాఠశాల పునః ప్రారంభం వేడుకలు



**మొగుళ్ళ పల్లి జూన్15 (జనంసాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని మొగుళ్లపల్లి మండల ములకలపల్లి ప్రాంతంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పసునూటి రాము గారి ఆధ్వర్యంలో నేడు పాఠశాల పునః ప్రారంభం వేడుకలు ఆటాహసంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గాదం శ్రీవాణి రమేష్ , ఉప సర్పంచ్ నీల రాజు కురుమ మాట్లాడుతూ ప్రభుత్వ బడికి ప్రతి ఒక్కరు వారి పిల్లలను తప్పకుండా పంపాలని ప్రజలను కోరుకుంటున్నాము అని తెలియాజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ గాదం శ్రీవాణి రమేష్ , ఉప సర్పంచ్ నీల రాజు, ఏఏపీసీ చైర్మన్ కే. లక్ష్మి ,పంచాయతీ కార్యదర్శి శరత్ కుమార్, ఉపాధ్యాయినిలు మేడం, మీనాక్షి మేడం, సృజన మేడం , అంగన్వాడీ టీచర్స్ జిజియా, ప్రభావతి,సుధా మేడంలు, ఆయాలు విద్యార్థులు గ్రామ పెద్దలు పాల్గొని విజయవంతం చేసినందుకు పాఠశాల తరుపున ధన్యవాదాలు తెలిపారు.

# ఆరోగ్య కార్యక్రమాలను అన్ని శాఖలతో విజయవంతం చేయాలి

**అదనపు కలెక్టర్ అశోక్ కుమార్**



**జయశంకర్ భూపాల పల్లి బ్యూరో, (జనంసాక్షి):** ఆరోగ్య కార్యక్రమాలను అన్ని శాఖల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్ అన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఐడిఓసి కార్యాలయంలో జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 28న ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం సందర్భంగా 0–5 సంవత్సరాల చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలన్నారు. జిల్లాలో 34728 మంది చిన్నారులు ఉన్నారని, 28న చుక్కలు వేయించుకోని పిల్లలను గుర్తించి, ఈ నెల 29, 30 తేదీలలో ఇంటింటికీ వెళ్లి చుక్కలు వేయాలని ఆదేశించారు. జూలై 13న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహించాలని, 1–19 సంవత్సరాల మధ్య వయసు గల వారు 70,773 మంది ఉన్నారని, వారికి అల్బెన్డజోల్ మాత్రలు ఇవ్వాలని సూచించారు.మిగిలిపోయిన పిల్లల కోసం జూలై 20న మాపప్ డే పెట్టడం జరుగుతుందన్నారు.

# నీట్ పరీక్షలు జిల్లాలో పకడ్బందీగా నిర్వహించాలి

**జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్.**

**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, జూన్ 15(జనంసాక్షి ):** ఈనెల 21వ తేదీన నిర్వహించనున్న నీట్ పరీక్షను జిల్లాలో పటిష్టమైన భద్రత ఏర్పాట్ల మధ్య పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) ఎం.డేవిడ్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి దాసరి వేణు, ఆసిఫాబాద్ డి ఎస్ పి అశోక్ లతో కలిసి సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో



నిర్వహించే నీట్ పరీక్షలు పటిష్టమైన భద్రత ఏర్పాట్లు మధ్య పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలో సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల–కళాశాల లో పరీక్ష కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని, 353 మంది విద్యార్థులు హాజరుకానున్నారని తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5.15 గంటల వరకు పరీక్ష ఉంటుందని, అభ్యర్థులను ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1.30 గంటల వరకు అనుమతించడం జరుగుతుందని, 1.30 గంటల తర్వాత పరీక్ష కేంద్రంలోనికి అనుమతి ఉండదని తెలిపారు. అభ్యర్థులు 2 పాస్పోర్ట్ సైజ్ ఫోటోలు, అడ్మిట్ కార్డు, గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా తీసుకురావాలని, పరీక్షా కేంద్రంలోనికి మొబైల్ ఫోను అనుమతి లేదని తెలిపారు. పరీక్ష కేంద్రంలో అభ్యర్థులకు సరిపడా కుర్చీలు, టేబుళ్లు ఉండేలా చర్యలు తీసుకోవాలని, పరీక్ష కేంద్రంలో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని, నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద వైద్య సిబ్బంది అవసరమైన మందు లతో శిబిరం ఏర్పాటు చేయాలని, ఆర్ టి సి అధికారులు సమయానుకూలంగా బస్సులు నడిపించాలని తెలిపారు.

# దరఖాస్తు దారులు సమర్పించిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించండి

- **వివిధ విభాగాలకు చెందిన 85 ఫిర్యాదుల స్వీకరణ**



**వరంగల్ ఎంజీఎం, జూన్ 15 (జనంసాక్షి):** దరఖాస్తు దారులు సమర్పించిన ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించాలని బల్దియా అదనపు కమిషనర్ జోనా అన్నారు. సోమవారం ప్రజావాణి (గ్రీవెన్స్) కార్యక్రమాన్ని పురస్కరించుకొని జీ డబ్ల్యు ఎం సి ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమం లో అదనపు కమిషనర్ తో పాటు వివిధ విభాగాలకు చెంది ఉన్నతాధికారులు నగర ప్రజల నుండి వివిధ సమస్యల పరిష్కారం కోసం అందజేసిన దరఖాస్తులను పరిష్కారనార్థం స్వీకరించారు. ఈ సందర్భంగా స్వీకరించిన ఫిర్యాదుల వివరాలు విభాగాల వారిగా..టౌన్ ప్లానింగ్ 41,ఇంజనీరింగ్ 24,రెవిన్యూ 7,హెల్త్ �డ శానిటేషన్10, నీటి సరఫరా 3 మొత్తంగా 85 వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డి ఎఫ్ ఓ శంకర్ లింగం ఇంచార్జి సి పి రవీందర్ రాడేకర్, పన్నుల అధికారి రామకృష్ణ, ఎం హెచ్ ఓ డా.రాజేష్, సెక్రటరీ అనిల్ బాబు, హెచ్ ఓ లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# నూతన డిఎంహెచ్ ఓను కలిసిన వైద్య బృందం..

**హనుమకొండ ప్రతినిధి జులై 15 (జనం సాక్షి) :** నూతన హనుమకొండ జిల్లా డిఎంహెచ్వో గా బాధ్యతలు చేపట్టిన డాక్టర్ ఎస్ .డి .రాంకుమార్ ని సోమవారం ప్రభుత్వ వైద్యుల సంఘం హనుమకొండ యూనిట్ అధ్యక్షులు డాక్టర్.మదన్మోహన్ రావు,రాష్ట్ర కార్యదర్శి డాక్టర్. కృష్ణారావు, కార్యదర్శి డాక్టర్ రాజారెడ్డి,డాక్టర్ గౌతమ్ చౌహాన్ కార్యవర్గ సభ్యులు ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ శిరీష్,మెడికల్ కౌన్సిల్ సభ్యులు డాక్టర్ నరేష్ కలిసి శుభాకాంక్షలు తెలియచేయడం జరిగింది అనంతరం డిఎంహెచ్వోను ఘనంగా సత్కరించారు వైద్య బృందానికి నూతన డిఎంహెచ్వో కృతజ్ఞతలు తెలియజేశారు .

# 'గోటు విలేజ్ - మాదిగ పల్లెలకు తరలండి' కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

**టేకుమట్ల జూన్ 15 (జనంసాక్షి) :** పద్మశ్రీ మందకృష్ణ మాదిగ ఇచ్చిన 40 రోజుల కార్యచరణ గోటు విలేజ్ – మాదిగ పల్లె కు తరలండి కార్యక్రమాన్ని విజయవంతం చేయలని ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి రాష్ట్ర నాయకులు అంబాల చంద్ర మౌళి మాదిగ పిలుపు నిచ్చారు. ఈ సందర్భంగా టేకుమట్ల మండలంలోని అమ్మ గార్డెన్ నందు ఎమ్మార్పీఎస్ మండల ఇంచార్జ్ మంద తిరుపతి మాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో రాష్ట్ర నాయకులు అంబాల చంద్ర మౌళి మాదిగ మాట్లాడుతూ పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు విద్యా , సంస్థగత నిర్మాణం , జెండా ఆవిష్కరణల కోసం మాదిగ పల్లెల్లోకి ప్రతి ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి మరియు అనుబంధ సంఘాల నాయకులు వెళ్లి అక్కడి మాదిగ యువతను చైతన్యం చేసే విధంగా ముందుకు సాగాలని,ఎస్సీల వర్గీకరణ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో 30 ఏళ్లు పోరాటం చేసి వర్గీకరణ సాధించుకున్నామని ఈ సాధించుకున్న వర్గీకరణ ఫలాలను మన జాతి బిడ్డలు అందిపుచ్చుకునేలా వారిని చైతన్యం చేయడం కోసం పద్మశ్రీ మందకృష్ణ మాదిగ గారు ఇచ్చిన కార్యచరణలో భాగంగా గో టు విలేజ్ మాదిగ పల్లెలకు తరలండి కార్యక్రమం ఈనెల 25 నుండి మొదలుకొని జూలై 05 వరకు జరుగుతుందని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ లు మాట్ల శ్రీనివాస్ ఇసంపెల్లి హారిక ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రామ్ రాంచందర్ మాదిగ రేణుకుంట్ల సంపత్ కన్నూరి సారయ్య అక్కల రాజయ్య ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు రేణుకుంట్ల శంకర్ ఎంఎస్పీ మండల కన్వీనర్ మాడుగుల వీరయ్య ప్రధాన కార్యదర్శి అంబాల సారయ్య అక్కల భద్రయ్య బోయిని కిష్టయ్య మచ్చ సరోత్తమ్ పాల శంకర్ బోయిని శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు

# ఘనంగా వెల్కమ్ డే స్కూల్ రెడీనెస్ కార్యక్రమం నిర్వహణ



**నడి కూడ జూలై 15 (జనం సాక్షి) :** మండల పరిషత్ ఉన్నత ప్రాథమిక పాఠశాల పులిగిల్లలో నూతన విద్యా సంవత్సరాన్ని పురస్కరించుకుని వెల్కమ్ డే మరియు స్కూల్ రెడీనెస్ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మండల విద్యాశాఖ అధికారి హనుమంతరావు హాజరయ్యారు ఈ సందర్భంగా విద్యార్థులను వారు ఉద్దేశించి మాట్లాడుతూ, పాఠశాల విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తుందని, ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. స్కూల్ రెడీనెస్ కార్యక్రమం ద్వారా చిన్నారుల్లో పాఠశాల పట్ల ఆసక్తి, ఆత్మవిశ్వాసం పెంపొందుతుందని తెలిపారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల స్వామి మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు నైతిక విలువలను కూడా అలవర్చుకోవాలని, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేసినప్పుడే విద్యార్థుల సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉమా, పద్మ, కవిత, ప్రదీప్, రాజేష్, రమేష్, విద్యార్థుల తల్లిదండ్రులు, అటెండర్ సూరమ్మ, వంటవారు సారమ్మ, శైలజ తదితరులు పాల్గొన్నారు.

# కోర్టుకు హాజరుకాని వ్యక్తి రిమాండ్

**మహదేవపూర్, జూన్15 (జనంసాక్షి):** కోర్టుకు హాజరుకాని వ్యక్తిని పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఎస్సై సాంబమూర్తి తెలిపిన వివరాల మేరకు మహదేవపూర్ మం డలం పెద్దంపేట గ్రామంలో 2020 సంవ త్సరంలో జరిగిన సంఘటన బూతు మాటలు తిట్టి చేతులతో కొట్టి ఆటోను ఆపి కర్రతో ఆటో అద్దాన్ని పగలగొట్టి నష్టపరిచిన వ్యక్తి పెద్దంపేట గ్రామానికి చెందిన దుర్గం సురేష్, అతనిపై నమోదైన కేసులో కోర్టు విచారణకు హాజరు కాకపోవడంతో మెజిస్ట్రేట్ వారి పై నాన్ – బేలేబుల్ వారెంటి జారీ చేయడంతో ఎస్ఐ ఏం సాంబమూర్తి అతన్ని పట్టుకొని భూపాల్ పెల్లి మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరిచారు. విచారణ అనంతరం మేజిస్ట్రే ట్ ఆదేశాల మేరకు అతని రిమాండ్ విధించి పరకాల సబ్‌జైలుకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

# జూకల్ ఉన్నత పాఠశాలలో ఉచిత పాఠ్యపుస్తకాల పంపిణీ



**చిట్యాల,జూన్ 15(జనం సాక్షి ):** జూకల్ గ్రామ సర్పంచ్ ఎల్లగొండ సంధ్యారాణి – తిరుపతి,అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ కోరుకొప్పుల కావ్య అశోక్ చేతుల మీదుగా జూకల్ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో ప్రభుత్వం అందిస్తున్న విద్యా సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకొని విద్యలో రాణించాలని సూచించారు. పాఠ్యపుస్తకాలు విద్యార్థుల విద్యాభ్యాసానికి పునాది వంటివని, వాటిని సక్రమంగా ఉపయోగించుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు రాధిక, రాణి, సాధు మమత, ఉమాదేవి, రంజిత్ కుమార్, స్వరూప, రూపశ్రీ, మహమ్మద్ రఫీ, పొన్నం రవీందర్, గాజర్ల శ్రీనివాస్, యోగానందాచారి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# కొయ్యూరు ఎస్ఐలకు సన్మానం



**మల్హర్,జూన్ 15(జనంసాక్షి) :** కొయ్యూరు పోలీస్ స్టేషన్‌లో నూ తనంగా బా ధ్యతలు స్వీకరిం చిన సబ్ ఇన్స్పెక్టర్లు (ఎస్ఐ) మహేందర్ కుమార్, కళ్యాణ్ లను స్థానిక ప్రజాప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పెద్దతూండ్ల సర్పంచ్ బండారి నర్సింగం, మాజీ సర్పంచ్ రాజు నాయక్, వార్డ్ మెంబర్ తాటికొండ కేశవ చారి కలిసి నూతన ఎస్ఐలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వారిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

# రోడ్డు పనులను ప్రారంభించిన సర్పంచ్ లు



**స్టేషన్ ఘన్‌పూర్ , జూన్ 15 ( జనం సాక్షి ) :** చిల్పూర్ మండలం లోని గార్లగడ్డ తండా గ్రామ పంచాయతీ పరిధిలోని మల్లన్న గండి సమీపంలో ఉన్నట్టువంటి మల్లన్న దేవుడు వద్దకు మేయిన్ రోడ్డు నుండి దేవాలయం వరకు వేస్తున్న రోడ్డు పనులను ఫతేపూర్ గ్రామ సర్పంచ్ గుగులోతు లక్ష్మీఊమ్లు నాయక్ మరియు గార్లగడ్డ తండా సర్పంచ్ మాలోతు నవీన్ ప్రారంభించారు. మల్లన్న గండి సమీపంలో ఉన్నట్టువంటి మల్లన్న దేవుడు కొన్ని దశాబ్దాల క్రితం వెలిసిన సంగతి తెలిసిందే, అయితే ఆ మల్లన్న దేవుని ఆశీస్సుల తో సోమవారం ఫతేపూర్ గ్రామ సర్పంచ్ గుగులో తు లక్ష్మీఊమ్లు నాయక్, గార్లగడ్డ తండా సర్పంచ్ మాలోతు నవీన్ ఇన్ని దశాబ్దాల తర్వాత మెయి న్ రోడ్ నుండి గుడి వరకు 10 ఫీట్ రోడ్ తీయించ డానికి నిర్ణయం చేయడంజరిగింది. ఈ కార్యక్రమం లో రెండు గ్రామ పంచాయతీల ఉప సర్పంచ్ లు, వార్డు సభ్యులు,గ్రామపెద్దలు, మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు,పూజారులు, నాయకులు, రెండు గ్రామాల ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## అందుకు తండ గ్రామంలో అమ్మ మాట - అంగన్వాడి బాట

**చిట్యాల, జూన్ 15( జనం సాక్షి ):** మండల కేంద్రంలోని అందుకు తండ గ్రామంలో జిల్లా కలెక్టర్, సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు బేటీ బచావో బేటీ పడావో,అమ్మ మాట – అంగన్వాడి బాట కార్యక్రమం సోమవారం సూపర్వైజర్ సునీత అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఇంచార్జి మిషన్ కోఆర్డినేటర్ క్రిష్ణ మాట్లాడుతూ మహిళా సాధికారత, బాల్య వివాహాల నివారణ, మహిళలు,బాలికల కోసం అందుబాటులో ఉన్న హెల్ప్‌లైన్ నంబర్లు, మహిళల రక్షణకు సంబంధించిన వివిధ చట్టాల గురించి అవగాహన కల్పించారు.

# అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించిన సర్పంచ్ నీరజ శ్రీనివాస్ గౌడ్



**ఆత్మకూరు, జూన్ 15 (జనం సాక్షి):** ఇటీవల వీచిన ఈదురుగాలులు, వర్షాలకు హనుమకొండ జిల్లా ఆత్మకూరు మండలం నీరుకుళ్ళ గ్రామంలోని అంగన్వాడి కేంద్రం దెబ్బతిన్నది. కేంద్రంపై ఉన్న రేకులు ఎగిరిపోవడంతో పాటు వాటర్ ట్యాంక్ కూడా పగిలిపోయింది. ఈ నేపథ్యంలో గ్రామ సర్పంచ్ తడక నీరజ శ్రీనివాస్ గౌడ్ అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి నష్టాన్ని పరిశీలించారు. చిన్నారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వెంటనే మరమ్మతు పనులు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు. అంగన్వాడి కేంద్రంలో అవసరమైన సౌకర్యాలు కల్పించి, భవనాన్ని పూర్తిస్థాయిలో మరమ్మతు చేయించేందుకు చర్యలు తీసుకుంటామని సర్పంచ్ తెలిపారు. గ్రామ ప్రజలు, అంగన్వాడి సిబ్బంది సమస్యలను గుర్తించి వెంటనే స్పందించిన సర్పంచ్‌ను స్థానికులు అభినందించారు.